

అదిరేటి డ్రస్సు మేమేస్తే..

నెల్లూరు నగరంలోని ప్రభుత్వ వైద్య కళాశాల పదో వార్షికోత్సవంలో భాగంగా శనివారం పలు కార్యక్రమాలు జరిగాయి. ఈ సందర్భంగా వైద్య విద్యార్థులు ఫ్యాన్సీ డ్రస్సులతో సందడి చేశారు. అంతకుముందు డ్యాన్స్ చేస్తూ స్టెప్పులు వేశారు. ఈలలు, చప్పట్లతో ప్రాంగణం మారుమోగింది.

- ఈనాడు, నెల్లూరు



ఈనాడు
శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు

ఆదివారం అక్టోబరు 6, 2024



జొన్నవాడ: రక్తబీజవధ అలంకరణ.. నెల్లూరు: కన్యకా పరమేశ్వరి ఆలయంలో అన్నపూర్ణగా.. ఆకట్టుకున్న అమ్మవార్ల అలంకరణ.. రాజరాజేశ్వరి ఆలయంలో భక్తుల రద్దీ



అమ్మ వైభవం.. ఆనంద వీక్షణం

శరన్నవరాత్రుల శోభతో.. జిల్లా వ్యాప్తంగా అద్వితీయ ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది. వివిధ రూపాల్లో కొలువుదీరిన అమ్మవార్లను దర్శించుకుని భక్తులు తన్మయత్వం చెందుతున్నారు. శనివారం జొన్నవాడలో కామాక్షితాయి రక్తబీజవధ అలంకరణలో దర్శనమివ్వగా- పెంచలకోనలో ఆదిలక్ష్మి అమ్మవారు ధాన్యలక్ష్మిగా అభయమిచ్చారు. నెల్లూరు అష్టలక్ష్మి ఆలయంలో దుర్గాదేవిగా, స్టోన్‌హౌస్‌పేట కన్యకాపరమేశ్వరీ ఆలయంలో అన్నపూర్ణాదేవిగా, ఇరుకళల పరమేశ్వరీ ఆలయంలో గజలక్ష్మిగా అమ్మవారు అభయప్రదానం చేశారు. ఆయా ఆలయాల్లో సాంస్కృతిక కార్యక్రమాలు భక్తులను అలరించాయి. - న్యూస్‌టుడే, నెల్లూరు(సాంస్కృతికం), బుచ్చిరెడ్డిపాళెం, పెంచలకోన




మాట్లాడుతున్న కేంద్ర సహాయ మంత్రి భూపతిరాజు శ్రీనివాసవర్మ చిత్రంలో ఎంపీ వేమిరెడ్డి తదితరులు

మత్స్య సంపద వినియోగంతో ప్రయోజనం

నెల్లూరు(వ్యవసాయం, బృందావనం), న్యూస్‌టుడే: దైనందిన ఆహారపు అలవాట్లలో మత్స్య సంపద వినియోగాన్ని పెంచాల్సిన ఆవశ్యకత ఉందని కేంద్ర భారీ పరిశ్రమలు, ఉక్కుశాఖల సహాయ మంత్రి భూపతిరాజు శ్రీనివాసవర్మ అన్నారు. జాతీయ మత్స్య అభివృద్ధి సంస్థ, మత్స్యకార సంక్షేమ సమితి ఆధ్వర్యంలో నగరంలోని వీఆర్సీ మైదానంలో మూడో రాష్ట్ర ఫిష్ ఫెస్టివల్‌ను శనివారం ఆయన ప్రారంభించారు. ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి, జేసీ కార్తీక్‌తో కలిసి వివిధ మత్స్యకార ఉత్పత్తుల స్టాళ్లను పరిశీలించారు. వాటి నిర్వాహకులతో మాట్లాడారు. అనంతరం టౌన్‌హాల్‌లో జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. అనేక వ్యాధులకు విరుగుడుగా ఆహారపు అలవాట్లలో చేపలు, రొయ్యలు తదితర సముద్ర ఉత్పత్తులను వినియోగించాలని వైద్యులు సైతం సూచిస్తున్నారని వివరించారు. తమిళనాడు కడలూరు మత్స్యకారులు మరబోట్లు వినియోగించి మత్స్య సంపదను దోచుకుపోతున్న విషయాన్ని ఎమ్మెల్యే సోమిరెడ్డి తన దృష్టికి తెచ్చారని, కేంద్ర మంత్రుల ద్వారా పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. ఎంపీ వేమిరెడ్డి మాట్లాడుతూ.. జిల్లాలో తీరప్రాంత మత్స్యకారులు ఎదుర్కొంటున్న సమస్యలను కేంద్ర ప్రభుత్వం దృష్టికి తీసుకువెళతామన్నారు. ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి మాట్లాడుతూ.. కృష్ణపట్నం పోర్టుకు కంటైనర్లు తిరిగి వచ్చేలా చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో మత్స్యకార సంక్షేమ సమితి రాష్ట్ర అధ్యక్షుడు కోలంగారి పోలయ్య, మాజీ ఎమ్మెల్సీ వాకాటి నారాయణరెడ్డి, భాజపా నాయకులు సన్నపురెడ్డి సురేష్‌రెడ్డి, సురేంద్రారెడ్డి, మత్స్యశాఖ జేడీ నాగేశ్వరరావు, ఏడీ రంగనాథ్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

వైకాపా ప్రభుత్వ నిర్లక్ష్యం జిల్లా రైతులను వెన్నాడుతూనే ఉంది. కాలువల పరిస్థితి చూస్తే ఆవేదన వ్యక్తమవుతోంది. జిల్లాలోని రెండు ప్రధాన జలాశయాల్లో 78 టీఎంసీలు నిల్వ ఉండగా- ఇప్పటికే పెన్నార్ డెల్టా, ఉత్తర, దక్షిణ కాలువల పరిధిలోని చెరువులకు నీరు వదిలారు.. ఇక ఆయకట్టులో పంటల సాగుకు కార్యాచరణ మాత్రమే మిగిలి ఉండగా- కాలువల దుస్థితే ఆందోళన కలిగిస్తోంది. గత అయిదేళ్ల నిర్లిప్తత.. పేరుకుపోయిన సమస్యలు.. పరిస్థితిని మరింత సంక్లిష్టంగా మార్చాయి.



డీసీపల్లి ప్రాంతంలో ఉత్తర కాలువ దుస్థితి

అయిదేళ్ల నిర్లక్ష్యం.. కాలువలే సాక్ష్యం!

నీటి ప్రవాహానికి ఎన్నో ప్రతిబంధకాలు ● కూటమి ప్రభుత్వంపై రైతుల ఆశలు

జలాశయం	నిల్వ సామర్థ్యం (టీఎంసీల్లో)	ప్రస్తుత నిల్వ (టీఎంసీల్లో)	ఇన్‌ఫ్లో (క్యూసెక్కుల్లో)	అవుట్ ఫ్లో (క్యూసెక్కుల్లో)
శ్రీశైలం	215	194.3	44,626	50,251
సోమశిల	78	52.81	7,311	11,853
కండలేరు	68	24.08	9,650	1,410

ఆత్మకూరు, న్యూస్‌టుడే

వైకాపా ప్రభుత్వం పెన్నార్ డెల్టా ఆధునికీకరణను గాలికి వదిలేసింది. దీని కింద పది ప్రధాన కాలువలు 194.4 కి.మీ పొడవునా ఉండగా- రెండుసార్లు పంపిన ప్రతిపాదనలనూ బుట్టదాఖలా చేయడం మినహా.. పూడిక తీసింది లేదు. ఇప్పుడు జలాలు పుష్కలంగా ఉండి.. సాగుకు వాతావరణం అనుకూలంగా ఉన్నా.. నీటిని పంటలకు చేర్చేలా కాలువలు లేవు. కొద్దిరోజులుగా రైతులే అక్కడక్కడా.. శ్రమదానంతో బాగు చేసుకుంటుండగా- ఎక్కువ మంది కూటమి ప్రభుత్వంపై ఆశలు పెట్టుకున్నారు. అందుకు తగ్గట్టుగానే ఇటీవల అధికారులు రూ. 18 కోట్లతో ప్రతిపాదనలు పంపారు. అక్టోబరు వచ్చేసిందని, పంటల సాగుకు నీటిని వదిలే లోపు.. పరిస్థితిని చక్కదిద్దాలని రైతులు కోరుతున్నారు.

> శ్రీశైలం జలాశయానికి వరద ఉద్ధృతి కొనసాగుతోంది. ప్రస్తుతం అక్కడ 44,626 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉండగా- ఇప్పటికే సోమశిల జలాశయానికి 63 టీఎంసీల వరకు నీరు చేరింది. పెన్నా వరద కాలం ముందున్నా.. సాగు నీటి లభ్యత విషయంలో ఇప్పటికే ఆశాజనక పరిస్థితులు నెలకొన్నాయి.

> ఉమ్మడి జిల్లాలో 10,70,165 ఎకరాల ఆయకట్టు ఉండగా- వీటి అవసరాలు తీర్చేలా.. 698.68 కి.మీ. కాలువలు ఉన్నాయి. సోమశిల జలాశయం పరిధిలో డెల్టా ఉత్తర, దక్షిణ కాలువలతో పాటు ఏటి కాలువలు ఉండగా- ఉత్తర కాలువ విస్తరణ పనులు చేసిన ప్రాంతంలో మినహా.. అంతటా.. పూడిక, చిల్లచెట్లతో నిండి కనిపిస్తున్నాయి.



బట్టేపాడు ఏటి కాలువలో పెరిగిన జమ్ము, తూటాకు

ప్రతిపాదనలు పంపించాం

డెల్టా కాలువల సమస్యల పరిష్కారానికి ప్రతిపాదనలు పంపించాం. ప్రభుత్వం నుంచి అనుమతులు రావాల్సి ఉంది. అవి రాగానే సమస్యలు పరిష్కరిస్తాం. రైతులకు సజావుగా సాగు నీరు అందేలా అన్ని చర్యలు తీసుకుంటాం.

– నాగరాజు, ఈఈ, జలవనరులశాఖ సెంట్రల్ డివిజన్

సోమశిల కింద పంపిణీ వ్యవస్థ

కాలువ	ఆయకట్టు (ఎకరాల్లో)
పెన్నార్ డెల్టా	2.47 లక్షలు
ఉత్తరకాలువ	1.41 లక్షలు
దక్షిణ కాలువ	41,000
కావలి కాలువ	75,000
కనుపూరు కాలువ	61,000

డీఆర్‌డీఏ పీడీ బాధ్యతల స్వీకరణ



నెల్లూరు (కలెక్టరేట్), న్యూస్‌టుడే: జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ ప్రాజెక్టు డైరెక్టర్‌గా నాగరాజ కుమారి శనివారం కలెక్టరేట్ ఆవరణంలోని కార్యాలయంలో బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ డీఆర్‌డీఏ ద్వారా ప్రజలకు సంక్షేమ పథకాలు అందించేందుకు కృషి చేస్తానని తెలిపారు. ఆమెను ఆ శాఖ అధికారులు, సిబ్బంది కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

ఏపీఎంఎస్ఐడీసీ ఈఈగా విజయభాస్కర్

నెల్లూరు(జీజీహెచ్) : ఆంధ్రప్రదేశ్ మెడికల్ సర్వీసెస్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ జిల్లా ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్‌గా ఎం.విజయభాస్కర్ శనివారం బాధ్యతలు స్వీకరించారు. ఈయన ఒంగోలులో జిల్లా అధికారిగా పనిచేస్తున్నారు. నెల్లూరులో ఖాళీగా ఉన్న ఈఈ పోస్టుకు ఫుల్ అడిషనల్ చార్జి(ఎఫ్ఏసీ) అధికారిగా నియమించారు.



ఎస్పీ, డీఎస్పీ, సిబ్బందిని అభినందిస్తున్న డీజీపీ ద్వారకా తిరుమల రావు

జాతీయ లోక్‌అదాలత్ కేసుల పరిష్కారంలో జిల్లా ప్రథమం

నెల్లూరు(నేర విభాగం), న్యూస్‌టుడే: జాతీయ లోక్ అదాలత్‌లో.. కేసుల పరిష్కారంలో నెల్లూరు జిల్లా రాష్ట్రంలోనే మొదటి స్థానంలో నిలవడం అభినందనీయమని డీజీపీ ద్వారకా తిరుమలరావు అన్నారు. శనివారం మంగళగిరిలో ఎస్పీ కృష్ణకాంత్, ఇతర సిబ్బందిని ఆయన అభినందించి ప్రశంసాపత్రాలు అందజేశారు. సమష్టి కృషితో గత నెల 14న జరిగిన లోక్ అదాలత్‌లో 1012 కేసులు పరిష్కరించినట్లు వెల్లడించారు. అదే స్ఫూర్తిని కొనసాగించాలని సూచించారు. డీజీపీని కలిసిన వారిలో నెల్లూరు(గ్రామీణ డీఎస్పీ ఘట్టమనేని శ్రీనివాసరావు, డీసీఆర్బీ ఎస్సై విజయ్‌కుమార్, నవాబుపేట హెడ్ కానిస్టేబుల్ నాగయ్య పాల్గొన్నారు.

గమ్మత్తులో.. యువత చిత్తు!

మూలాలపై దృష్టిపెడితేనే గంజాయికి అడ్డుకట్ట


ఈనాడు, నెల్లూరు: నేరవార్తలు, న్యూస్‌టుడే: ఉన్నత భవిష్యత్తుకు బంగారు బాటలు వేసుకోవాల్సిన యువత.. గంజాయి మత్తుకు చిత్తవుతోంది. సరదాగా మొదలై.. వ్యసనంగా మారి.. నిర్మానుష్య ప్రాంతాలను అడ్డాలుగా మార్చుకుని నిషాలో తూగుతున్న వారి సంఖ్య పెరుగుతుండగా- ఆ మత్తును నిర్మూలిస్తామని సంబంధిత వర్గాలు ఏళ్లుగా చెబుతున్న మాటలు వాస్తవ రూపం దాల్చడం లేదు. సూత్రధారులపై దృష్టిపెడితేనే అడ్డుకట్ట పడేది.

కఠిన చర్యలు తీసుకోకనే!

ఎన్‌డీపీఎస్(నార్కోటిక్ డ్రగ్స్ అండ్ సైకోట్రాఫిక్ సబ్‌స్టాన్సెస్) చట్టం ప్రకారం.. కిలో అంతకంటే తక్కువ పరిమాణంతో పట్టుబడితే. . సదరు వ్యక్తిని వినియోగదారుగా పరిగణిస్తూ చట్టంలోని 26, 27 తదితర సెక్షన్ల కింద కేసులు నమోదు చేస్తున్నారు. ఇలాంటి సందర్భాల్లో నేరాభియోగం తక్కువగా ఉండటంతో బెయిల్ వెంటనే లభిస్తోంది. గంజాయితో పట్టుబడినా పెద్ద సమస్య లేకుండా బయటకు వస్తున్నామని భావించే కొందరు అడ్డదారులు తొక్కుతున్నారు. మత్తుకు, విలాసాలకు అలవాటు పడి.. గంజాయి విక్రేతలు, సరఫరాదారుల అవతారం ఎత్తుతున్నారు. కొందరు కళాశాలల విద్యార్థులు ఇలా చేస్తూ పోలీసులకు పట్టుబడుతున్నారు.

కమీషన్ల ఎర!

నెట్‌వర్క్ పెంచుకునేందుకు ప్రయత్నిస్తున్న స్మగ్లర్లు.. సరకు రవాణా కోసం కమీషన్ల ఆశ చూపి.. అమాయకులను దందాలోకి లాగుతున్నారు. ప్రధానంగా కళాశాలల విద్యార్థులను అందుకోసం ఎంపిక చేస్తున్నారు. ఏవోబీ నుంచి నగరానికి రహస్యంగా గంజాయి తీసుకొస్తే రూ. లక్షల్లోనే కమీషన్ ముట్ట చెబుతున్నట్లు సమాచారం. ఎక్కువగా డ్రైవర్లు ఈ ఉచ్చులో చిక్కుకుంటున్నారు. కొన్ని రోజుల కిందట నెల్లూరు నగర శివారులో ఇద్దరు విద్యార్థులు గంజాయి తాగుతూ పోలీసులకు దొరకగా- వారిలో ఒకరు విక్రయించే వారు, మరొకరు కొత్తగా అలవాటు చేసుకునేవారు ఉండటం గమనార్హం.



చర్యలు తీసుకుంటాం

జిల్లా వ్యాప్తంగా గంజాయి నిరోధంపై ప్రత్యేక చర్యలు తీసుకుంటాం. అక్రమ రవాణాపైనా దృష్టిసారిస్తాం. వీలైనంత వరకు రాకుండా కట్టడి చేస్తాం. – శ్రీనివాసరావు, డిప్యూటీ కమిషనర్, ఎక్సైజ్

'విశ్వసనీయ సమాచారం ఆధారంగా అప్పుడప్పుడూ విక్రేతలను పట్టుకోవడం తప్పితే.. ఆ దందా వెనకున్న బడా వ్యాపారులపై దృష్టిపెట్టడం లేదు. జిల్లాకు ఏ ప్రాంతం నుంచి సరఫరా అవుతోంది? రవాణాకు సహకరిస్తున్నది ఎవరు? అన్నది గుర్తిస్తేనే పూర్తిస్థాయిలో అడ్డుకట్ట పడే అవకాశం ఉంది.'

'అసలు మూలాలకు అడ్డుకట్ట వేసేలా చర్యలు పెరిగితేనే అమాయక యువత, విద్యార్థులు, ప్రజలు మత్తు బారిన పడకుండా ఉండే అవకాశం ఉంది. విశాఖ జిల్లా మన్యంతో పాటు గోదావరి జిల్లాల నుంచి పెద్దమొత్తంలో కొనుగోలు చేసి తీసుకొచ్చే వారిని గుర్తించడంతో పాటు.. స్మగ్లర్ల గొలుసు కట్టును తెగ్గొట్టాల్సి ఉంది.'

నెల్లూరులోనూ ఆపరేషన్ బుడమేరు తరహా చర్యలు

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట), న్యూస్‌టుడే: నెల్లూరు నగరాభివృద్ధి, సింహపురి ప్రజల భవిష్యత్తు కోసం ఆపరేషన్ బుడమేరు తరహా చర్యలను యుద్ధప్రాతిపదికన ప్రారంభిస్తున్నట్లు పురపాలకశాఖ మంత్రి పొంగూరు నారాయణ స్పష్టం చేశారు. శనివారం ఆయన నగర నియోజకవర్గంలోని 16వ డివిజన్ చెక్కుల తూము, సర్వేపల్లి కాలువ తదితర ప్రాంతాల్లో పర్యటించారు. జలవనరులు, పురపాలక, రెవెన్యూ శాఖలు, గ్రీన్ కార్పొరేషన్ అధికారులతో కలిసి సాగునీటి కాలువలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ. .నగరంలోని ప్రధాన కాలువల స్థితిగతులపై సమగ్ర సర్వే చేపట్టాలని ఆదేశించామన్నారు. బుడమేరు వరదలతో ఏడు లక్షల మంది ప్రజలు ఇబ్బందులు పడ్డారని, వరద ఉద్ధృతి కారణంగా సహాయ చర్యలు చేపట్టేందుకు ప్రభుత్వం సైతం అవస్థలు పడిందన్నారు. అలాంటి పరిస్థితులు ఎక్కడా జరగకూడదనే రాష్ట్రంలోని అన్ని ప్రాంతాల్లో ఆపరేషన్ బుడమేరు తరహా చర్యలు ప్రారంభిస్తున్నామని తెలిపారు. కాలువల స్థితిగతులపై పూర్తిస్థాయి పరిశీలన జరుగుతుందని, ఆ మేరకు కచ్చితంగా ఆక్రమణల తొలగింపు చేపడతామన్నారు. పేదలు ఆక్రమించుకుని ఉంటే.. వారికి ప్రత్యామ్నాయం చూపిస్తామన్నారు.



సర్వేపల్లి కాలువను పరిశీలిస్తున్న మంత్రి నారాయణ

షాడో ఎమ్మెల్యేలు, మంత్రులు లేరు..

ఇక్కడెవరూ షాడో ఎమ్మెల్యేలు, మంత్రులు లేరని.. అంతా తన కనుసన్నల్లోనే జరుగుతోందని.. తానంటే ఏమిటో ప్రజలకు కూడా తెలుసు అని మంత్రి అన్నారు. నమ్మకంతో ఓటేసి గెలిపించిన ప్రజలందరి బాధ్యత తనపై ఉందన్నారు. 50వ డివిజన్ పినాకిని పార్కు తదితర ప్రాంతాల్లోనూ పర్యటించారు. రూరల్‌లోని స్వర్ణాల చెరువు, ఇటు పినాకిని పార్కును టూరిజం ప్రాంతాలుగా తీర్చిదిద్దుతామని వివరించారు.



విద్యార్థి జీవితానికి నవోదయం

9వ తరగతి, ఇంటర్ ప్రవేశాలకు ప్రకటన

దరఖాస్తులకు ఆఖరు తేదీ అక్టోబర్ 31

పరీక్ష తేదీ: 8 ఫిబ్రవరి, 2025

సంప్రదించాల్సిన ఫోను నంబర్లు: 63004 29938, 89850 07588

దరఖాస్తు చేసుకునేందుకు వెబ్‌సైటు: www.navodaya.gov.in

మర్రిపాడు (ఆత్మకూరు గ్రామీణం), న్యూస్‌టుడే: నవోదయ విద్యాలయంలో 2025-2026 విద్యా సంవత్సరానికి తొమ్మిదో తరగతి, ఇంటర్ ప్రవేశాలకు సంబంధించి ప్రవేశ పరీక్షకు ప్రకటన విడుదలైంది. ఖాళీగా ఉన్న సీట్ల కోసం అక్టోబర్ 31వ తేదీ వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తులు స్వీకరిస్తున్నారు. 9వ తరగతి ప్రవేశానికి 8వ తరగతిలో ఉత్తీర్ణులై ఉండాలి. ఇంటర్ ప్రవేశానికి పదో తరగతి ఉత్తీర్ణత పొంది ఉండాలి. వీరంతా ప్రభుత్వ లేదా ప్రభుత్వ గుర్తింపు పొందిన పాఠశాలలో చదివినవారై ఉండాలి. గ్రామీణ ప్రాంత విద్యార్థులకు 75 శాతం, పట్టణ ప్రాంత విద్యార్థులకు 25 శాతం సీట్లు కేటాయిస్తారు. మొత్తం సీట్లలో 33 శాతం సీట్లు బాలికలకు కేటాయిస్తారు.

ప్రత్యేకతలు.. ● కృష్ణాపురం నవోదయ విద్యాలయం 57 ఎకరాల విస్తీర్ణంలో ఉంది. ● బాలబాలికలకు ప్రత్యేకంగా వసతి ఉంటుంది. ● అతి పెద్ద గ్రంథాలయం ఉంది. ● పోటీ పరీక్షలకు హాజరయ్యేందుకు అవసరమైన ఐఐటీ, నీట్ బుక్స్, ఎన్ఐటీ, ఎయిమ్స్ ఇతర పరీక్షలకు అవసరమైన పుస్తకాలు అందుబాటులో ఉన్నాయి. ● క్రీడాకారులకు ఖోఖో, క్రికెట్, వాలీబాల్, కబడ్డీ, బ్యాడ్మింటన్ ఆడేందుకు విశాలమైన మైదానం ఉంది.

ప్రణాళిక ప్రకారం చదివిస్తాం: శ్రీనివాసరావు, ప్రిన్సిపల్

విద్యార్థులకు ఉత్తమ బోధనతోపాటు ప్రణాళిక ప్రకారం చదివిస్తాం. విద్యార్థులతో స్నేహపూర్వకంగా ఉంటాం. క్రీడలు, ఇతర సాంస్కృతిక కార్యక్రమాలు, చిత్రలేఖనం వంటి వాటిలో శిక్షణ ఇస్తాం. ఇక్కడ చదివిన విద్యార్థుల్లో ఐఏఎస్, ఐపీఎస్, ఇతర ఉన్నత ఉద్యోగాలు సాధించిన వారు ఉన్నారు.



ఇలా వదిలేస్తే.. పాడవదా?

బిట్రగుంట, న్యూస్‌టుడే: యువతకు శిక్షణ ఇచ్చి వారి జీవితాల్లో వెలుగులు నింపాలనేదే లక్ష్యం. అందుకోసం రూ.3.50కోట్లతో విశాలమైన భవనం నిర్మించారు. దాన్ని ఐటీడీఏ స్వాధీనం చేసుకొని నాలుగేళ్లకు పైగా గడిచింది. ఇందులో ఉపాధి శిక్షణ ఎప్పుడు జరుగుతుందోనని యువత నేటికీ వెయ్యి కళ్లతో ఎదురుచూస్తున్నారు. వినియోగంలోకి తేకపోతే ఈ భవన సముదాయం పాడయ్యే అవకాశం ఉంది. బోగోలు మండలం కప్పరాళ్లతిప్ప వద్ద జాతీయ రహదారికి పడమర వైపు ఉన్న ఈ భవనాన్ని చూస్తే అర్థమవుతుంది. గతంలో తెదేపా ప్రభుత్వం జిల్లా సమీకృత గిరిజనాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో గిరిజన యువకులకు శిక్షణ కేంద్రాన్ని నిర్మించారు. 2018లోనే రెండు ఎకరాల భూమిని కేటాయించింది. భవన నిర్మాణానికి రూ.3.50కోట్లు నిధులు కేటాయించింది. గుత్తేదారు భవనాన్ని పూర్తిచేసి నాలుగేళ్ల కిందట ఐటీడీఏకి అప్పగించారు. అందులో వివిధ కోర్సుల్లో 260 మందికి ఒకే సారి ఉపాధి శిక్షణ ఇచ్చే సౌకర్యం ఉంది. కానీ, యువత నేటికీ ఉపాధి శిక్షణ ఎప్పుడు ప్రారంభిస్తారోనని ఎదురు చూడాల్సిన పరిస్థితి. గత ప్రభుత్వం పట్టించుకోకపోవడంతో ఈ దుస్థితికి కారణం. అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి ఈ విలువైన భవన సేవలు యువతకు ఉపయోగపడేలా చూడాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

డీఆర్‌డీఏకి అప్పగించేందుకు చర్యలు

పరిమళ, జిల్లా ఐటీడీఏ పీవో : యువత ఉపాధి శిక్షణ కేంద్రాన్ని డీఆర్‌డీఏకి అప్పగించేందుకు కసరత్తు జరుగుతుంది. ప్రభుత్వ ఆదేశాన్ని అందిపుచ్చుకొని యువతకు ఉపాధి రంగాలపై శిక్షణ ఇచ్చే కార్యక్రమాన్ని త్వరలోనే ప్రారంభం కానుంది. అందుకు అవసరమైన మౌలిక సదుపాయాల కల్పనపై కూడా దృష్టిపెట్టాం.

సమాచార స్రవంతి

బంగారం ధరలు

గ్రాము ధర:	రూ. 7,334
(3 శాతం జీఎస్టీ కలిసిన ధర)	
సవర ధర:	రూ. 58,672
వెండి గ్రాము :	రూ. 98.20

వెంకాబ్ కోళ్ల ధరలు

బ్రాయిలర్ (రైతుధర)	123
రిటైల్	145
లేయర్	110
బ్రాయిలర్స్	210
బ్రాయిలర్స్ స్కిన్‌లెస్	229
లేయర్ మాంసం	187
నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్	
బ్రాయిలర్	132
లేయర్	110
బ్రాయిలర్స్	236
బ్రాయిలర్స్ స్కిన్‌లెస్	260
లేయర్ మాంసం	187

చట్టాలపై అవగాహన అవసరం

లోక్ అదాలత్ జిల్లా ఛైర్మన్ రామశ్రీనివాసరావు

కావలి, న్యూస్‌టుడే: ప్రతి ఒక్కరూ చట్టాలపై అవగాహన పొందటం ద్వారా గౌరవప్రదమైన జీవనం గడించాలని లోక్ అదాలత్ జిల్లా ఛైర్మన్ రామశ్రీనివాసరావు అన్నారు. కావలి పట్టణంలోని ఐసీడీఎస్ కార్యాలయంలో శనివారం అంగన్‌వాడీ మహిళలకు న్యాయవిజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గృహ హింస, మనోవర్తి, వరకట్నం, తదితర చట్టాలపై అవగాహన అవసరమన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు కూడా తెలుసుకోవాలన్నారు. మండల లీగల్ సర్వీసెస్ అథారిటీ ఛైర్‌పర్సన్, న్యాయమూర్తి శోభ, ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి సుధాకర్, అదనపు ప్రథమశ్రేణి న్యాయమూర్తి విక్రమసిన్హా, న్యాయవాదులు సురేంద్రరెడ్డి, సాయిప్రసాద్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న లోక్ అదాలత్ జిల్లా ఛైర్మన్

ప్లాస్టిక్ కాలుష్యం హానికరం

వెంకటాచలం, న్యూస్‌టుడే: ప్లాస్టిక్ కాలుష్యం మానవులతో పాటు, జంతువులకు, ఆక్వాటిక్ జీవులకు హానికరంగా మారిందని వీఎస్‌యూ ఉపకులపతి విజయ భాస్కరరావు ఆందోళన వ్యక్తం చేశారు. విశ్వవిద్యాలయంలో శనివారం ప్లాస్టిక్ వినియోగంపై ఒక రోజు అవగాహన సదస్సు నిర్వహించారు. వీసీ మాట్లాడుతూ... మహమ్మారిలా మారిన ప్లాస్టిక్ కాలుష్యం నియంత్రణకు తగిన చర్యలు తీసుకోవాలని సూచించారు. విరివిగా ఉపయోగిస్తున్న ప్లాస్టిక్ వినియోగం తగ్గించి, స్టెయిన్‌లెస్ స్టీల్ బాటిళ్లు వినియోగించాలన్నారు. పలువురికి స్టీల్ సీసాలు అందజేశారు.



స్టీల్ సీసాలు అందిస్తున్న ఉపకులపతి విజయ భాస్కరరావు

పోలీసుస్టేషనులో పిడుగు పాటుకు సామగ్రి దగ్ధం

వెంకటాచలం : వెంకటాచలం పోలీస్‌స్టేషన్‌పై శుక్రవారం రాత్రి పిడుగు పడింది. స్టేషన్‌లోని మొత్తం నిఘా నేత్రాల వ్యవస్థతో పాటు, వైర్‌లెస్ సెట్లు, ఫ్యాన్లు దగ్ధమయ్యాయి. ప్రమాదంలో రూ.లక్షకు పైగా నష్టం వాటిల్లింది. స్టేషన్ సమీపంలోని పలు ఇళ్లలో ఫ్యాన్లు, టీవీలు, ఫ్రిజ్‌లు కాలిపోయాయి.

అదాని పాఠశాలలో దసరా ఉత్సవాలు

ముత్తుకూరు : మండలంలోని అదాని పాఠశాలలో శనివారం దసరా ముందస్తు వేడుకలు నిర్వహించారు. కార్యక్రమంలో పాల్గొన్న ప్రిన్సిపల్ సత్యనారాయణ మాట్లాడుతూ... విద్యార్థి దశనుంచే ప్రతి ఒక్కరూ మంచి ఆలోచనలు కలిగి ఉండాలని, అప్పుడే ఉన్నత స్థానాలకు చేరతారన్నారు. దసరా నవరాత్రుల విశిష్టతను వివరించారు. రావణాసురుని బొమ్మ దహనం చేశారు. విద్యార్థులు చేసిన నృత్యాలు ఆకట్టుకున్నాయి.



నృత్యాలు చేస్తున్న విద్యార్థినులు

బూడిద టిప్పర్ల అడ్డగింత

ముత్తుకూరు : జెన్‌కో నుంచి బూడిద తరలిస్తున్న టిప్పర్లను కప్పలదొరువు గ్రామస్థులు శనివారం అడ్డుకున్నారు. నిరంతరం తిరుగుతుండటంతో బూడిద రోడ్లపై, నివాసాల్లోకి చేరుతోందని స్థానికులు వాపోతున్నారు. వాహనాలపై పట్టలు కప్పి రవాణా చేయాలని పలుమార్లు చెప్పినా పట్టించుకోవడం లేదని, ఆవేదన వ్యక్తం చేశారు. అధికారులు స్పందించి వాహనాలను నియంత్రించాలని కోరారు.



కావలి

• కావలి • ఉదయగిరి • కందుకూరు


ఎమ్మెల్యే కాకర్ల సురేష్‌కు సమస్యలు వివరిస్తున్న ప్రజలు

సాగునీటి సమస్య పరిష్కరిస్తాం

కలిగిరి, న్యూస్‌టుడే: ఉదయగిరి నియోజకవర్గంలో నెలకొన్న సాగు, తాగునీటి సమస్యను తీర్చేందుకు కృషి చేస్తానని ఎమ్మెల్యే కాకర్ల సురేష్ తెలిపారు. సోమశిల నుంచి రాళ్లపాడు జలాశయానికి విడుదల చేసిన నీరు శనివారం మండలానికి చేరుకోవడంతో జిర్రావారిపాలెం కాలువ దగ్గర జలహారతి కార్యక్రమం చేపట్టారు. ప్రస్తుతం తాగునీటి అవసరార్థం 700 క్యూసెక్కుల నీటిని విడుదల చేశామన్నారు. త్వరలో జరగబోయే ఐఏబీ సమావేశంలో సాగునీటి విషయం చర్చిస్తామన్నారు. అనంతరం స్థానిక సమస్యలను అధికారులు, ప్రజలను అడిగి తెలుసుకున్నారు. తెదేపా మండల కన్వీనర్ బిజ్జం కృష్ణారెడ్డి, కూటమి పార్టీల నాయకులు రామారావు, నరసింహులునాయుడు, అంకిరెడ్డి, సతీష్, తాతయ్య పాల్గొన్నారు.

పూడికతీత పనులు చేపట్టాలి

జలదంకి, న్యూస్‌టుడే: పాపిరెడ్డి కావలి కాలువ చివరి ఆయకట్టు వరకు తక్షణమే పూడికతీత పనులు చేపట్టి చెరువులను సోమశిల జలాలతో నింపాలని ఏపీ రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు రావి మాల్యాద్రి డిమాండ్ చేశారు. శనివారం మండల కేంద్రంలోని సీపీఎం పార్టీ కార్యాలయంలో రైతులతో సమావేశమయ్యారు. ఆయన మాట్లాడుతూ గత అయిదేళ్లుగా కావలి కాలువ పూడికతీత పనులు చేపట్టకపోవటంతో చివర ప్రాంతాలకు సాగునీరందక పంటలు ఎండిపోయి రైతులు తీవ్రంగా నష్టపోయారన్నారు. అన్నదాతల సమస్యలను పరిష్కరించాలన్నారు. సీపీఎం మండల ప్రధాన కార్యదర్శి ఎం. ఆంథోనిబాబు, కె. తిరుపాలు, జి. ప్రసాద్ పాల్గొన్నారు.

దామచర్ల, నూకసానికి ఎమ్మెల్యే అభినందనలు


నూకసాని బాలాజీకి పుష్పగుచ్ఛం ఇచ్చి అభినందనలు తెలుపుతున్న ఎమ్మెల్యే ఇంటూరి, చల్లా శ్రీనివాసరావు

కందుకూరు గ్రామీణం, న్యూస్‌టుడే: రాష్ట్ర పర్యాటక అభివృద్ధి సంస్థ ఛైర్మన్‌గా డాక్టర్ నూకసాని బాలాజీ, మారిటైం బోర్డు కార్పొరేషన్ ఛైర్మన్‌గా దామచర్ల సత్యను విజయవాడలో ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు కలిసి శాలువాతో సన్మానించి పుష్పగుచ్ఛం ఇచ్చి అభినందనలు తెలిపారు. ఆయనతోపాటు ప్రకాశం జిల్లా డైరీ మాజీ ఛైర్మన్ చల్లా శ్రీనివాసరావు, పార్టీ మండల అధ్యక్షులు నార్నే రోశయ్య, మాదాల లక్ష్మీనరసింహం, నాయకులు పిడికిటి వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

పారిశుద్ధ్య కార్మికులకు దుస్తుల పంపిణీ

కందుకూరు గ్రామీణం, న్యూస్‌టుడే: గత నెలలో విజయవాడలో జరిగిన వరద సహాయక చర్యల్లో పాల్గొన్న పారిశుద్ధ్య కార్మికులకు ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు దుస్తులు పంపిణీ చేశారు. స్థానిక పురపాలక సంఘ కార్యాలయంలో శనివారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమంలో భాగంగా విద్యార్థులకు నిర్వహించిన క్విజ్ పోటీల్లో విద్యార్థులకు బహుమతులు అందజేశారు. పురపాలక కమిషనర్ అనూష, పట్టణ తెదేపా అధ్యక్షుడు దామా మల్లేశ్వరరావు, ఉప్పుటూరి శ్రీనివాసరావు పాల్గొన్నారు.



ఈ చిత్రంలో కనిపించేది కావలి పట్టణంలోని ప్రభుత్వ ఆసుపత్రికి వైద్య సేవల నిమిత్తం వచ్చిన వృద్ధుడు. ఆయన పేరు మేదరమెట్ల మాలకొండయ్య. వయస్సు 90 సంవత్సరాలు. ఆసుపత్రి వరకు ఓ వాహనంలో రాగా, అక్కడ మనవడి సాయంతో వైద్యుని వద్దకు ఎంతో ప్రయాసపడుతూ వెళ్తుండగా 'న్యూస్‌టుడే' క్లిక్ మనిపించింది. ఆసుపత్రిలో వీల్‌ఛైర్లున్నా, సిబ్బందికి పట్టడం లేదు. ఇటీవల నాడు-నేడు మన ఆసుపత్రిలో భాగంగా కొత్త భవన సముదాయం నిర్మించారు. దీంతో చాలామందికి అవగాహన లేక అటూఇటు తిరుగుతూ ఇబ్బందులు పడుతున్నారు. కుటుంబ సభ్యులు తోడుగారాని వయోవృద్ధుల వెతలు వర్ణనాతీతం.



చిత్రంలో కనిపించేది కావలి ప్రభుత్వ ఆసుపత్రిలో ఓపీ వద్ద బారులుదీరిన రోగులు. ప్రస్తుతం ఆయుష్మాన్ భారత్ పథకంలో భాగంగా ప్రతి రోగికి సంబంధించిన పూర్తి వివరాలను కంప్యూటరీకరించాల్సి వస్తోంది. ఈ క్రమంలో ఒక్కో రోగికి చెందిన పేరు, చిరునామా, చరవాణి సంఖ్య, వ్యాధులు(దీర్ఘకాలికంతోపాటు, ప్రస్తుతం చూపించుకునేందుకు వచ్చిన వాటి గురించి), ఆధార్ సంఖ్య, తదితర వివరాలన్నీ నమోదు చేయాలి. దీంతో ఒక్కో రోగికి సంబంధించిన ఓపీ స్లిప్పు ఇచ్చేందుకు కనీసం అయిదు నిమిషాల వరకు సమయం పడుతోంది. తరచూ వరుసలు బారులు తీరుతున్నా ప్రత్యామ్నాయాలపై అధికారుల్లో స్పందన సరిలేదు.

పర్యవేక్షణ ఏదీ ?

రోగుల అష్టకష్టాలు

న్యూస్‌టుడే, కావలి: స్థానిక ప్రాంతీయాసుపత్రి నిర్వహణలో అనేక లోపాలు వెంటాడుతున్నాయి. నిత్యం అయిదువందల మంది వరకు ఓపీ సేవల కోసం వస్తుంటారు. అదేవిధంగా వంద పడకలు ఎప్పుడూ రద్దీగానే ఉంటున్నాయి. అయితే, రోగులకు ఇబ్బందులు తీరేలా వైద్యాధికారులు శ్రద్ధ చూపడం లేదు. వీల్‌ఛైర్లు అందుబాటులో ఉన్నా, అవసరమైన వారికి వినియోగించడం లేదు. ఆయుష్మాన్‌భవ కార్యక్రమం మంచిదే అయినా, అదే సందర్భంలో ఎదురవుతున్న బాలారిష్టాలు అధిగమించే దిశగా కార్యాచరణ కరవవుతోంది. ఇటీవల చెంచుగానిపాళెంకు చెందిన ఓ మహిళ కాలిన గాయాలతో రాగా, చికిత్స నిమిత్తం అందుబాటులో ఉండాల్సిన ఏసీ గది లేక ఇబ్బందులు పడ్డారు. ఎక్స్‌రేలు తీయించుకున్న మర్నాడు మరలా ఆసుపత్రికి వస్తేగాని వివరాలు తెలియడం లేదు. ఈ విధంగా ఆసుపత్రికి వచ్చే రోగులకు చాలా సేవలపరంగా లోపాలు వెంటాడుతూ అష్టకష్టాలు పడుతున్నారు.

వైద్యుల కొరత

ఆసుపత్రిలో 23 మంది వరకు వివిధ విభాగాలకు సంబంధించి వైద్యులుండాలి. ప్రస్తుతం 15మంది తోనే నెట్టుకొస్తున్నట్లు బోర్డుపై వివరాలు కనిపిస్తున్నాయి. వంతులవారీగా రాత్రివేళల్లో విధులు సైతం చేస్తున్నారు. జాతీయ రహదారికి ఆనుకుని ఈ పట్టణం ఉంది. ఇక్కడ తరచూ ప్రమాదాలు జరుగుతుంటాయి. ఈ క్రమంలో ట్రామాకేర్ యూనిట్ అవసరం ఉంది.

సవరించుకుంటాం:

సిబ్బంది బాధ్యతగా పనిచేసేలా చూస్తాం. రోగులకు ఇబ్బందులు తలెత్తకుండా అప్రమత్తంగా ఉంటాం. హెచ్‌డీఎస్ సభ్యులు కూడా మాకు సహకరిస్తున్నారు. ఓపీ వద్ద బారులు తీరకుండా చర్యలు తీసుకున్నాం.

-ప్రమీల, ఆర్ఎంవో, కావలి ప్రాంతీయాసుపత్రి

మేమున్నాం.. మీకు తోడుగా!

(10 AM to 1 PM) కావలి : 80080 51666, 91548 46698
కందుకూరు:70939 81624, ఉదయగిరి : 80085 73944

సమస్య: కావలి పట్టణంలోని చాలా దుకాణాల్లో నూనె ప్యాకెట్ల తూకాల్లో మోసాలు జరుగుతున్నాయి. **-సొంగాకుమార్, బాపూజీనగర్‌కాలనీ, కావలిపట్టణం**

సమాధానం: ప్రస్తుతం బిజీగా ఉన్నాం. ఈ పనులు పూర్తికాగానే.. ఆయా తూకాల్లో మోసాలపై తప్పక విచారణ **చేస్తాం. -కరీముల్లా, ఇన్‌స్పెక్టర్, తూనికలు, కొలతల శాఖ, కావలి**

? వ్యవసాయ శాఖ ద్వారా ప్రభుత్వం రాయితీపై మిరప, పండ్ల తోటలకు నీటి తడులు ఇచ్చేందుకు అవసరమైన డ్రిప్ పరికరాలు, ప్లాస్టిక్ గొట్టాలు పంపిణీ చేయాలి.
- వెంకటేశ్వర్లు, వలేటివారిపాలెం

✓ప్రస్తుతం 50 శాతం రాయితీతో డ్రిప్ పరికరాలు, ప్లాస్టిక్ గొట్టాలు అందజేస్తుంది. అవసరమైన రైతులు రైతు సేవా కేంద్రాల్లో నమోదు చేసుకోవాలి. **- హేమంత్ భరత్‌కుమార్, ఏవో వలేటివారిపాలెం, న్యూస్‌టుడే**

భార్యపై అనుమానంతో దాడి

కావలి, న్యూస్‌టుడే: భార్యపై అనుమానంతో భర్త తీవ్రంగా కొట్టి గాయపర్చిన ఘటనపై శనివారం కావలి పోలీసులు విచారణ జరుపుతున్నారు. మండలంలోని గౌరవరంలో వల్లూరు కోటయ్య తన సతీమణిని కర్రతో కొట్టి గాయపరిచాడు. స్థానికులు ఆమెను కావలి ప్రభుత్వ ఆసుపత్రిలో చేర్పించి.. చికిత్స చేయించారు.

సొంత నిధులతో అయిదుబోర్లు



పట్టణంలోని పాతూరులో నీటి సమస్య పరిష్కారానికి తెదేపా యువ నాయకుడు జనిగర్ల మనోహర్‌యాదవ్ చొరవ చూపారు. శనివారం తన సొంత నిధులతో అయిదుబోర్లు తవ్వించారు. ప్రస్తుతం పురపాలక సంఘం నీటి సరఫరా అంశంలో వైఫల్యం చెందడటంతో ఈ నాయకుడు స్పందించారు. ఈయన్ను ఎమ్మెల్యే డీవీ కృష్ణారెడ్డి అభినందించారు.

-న్యూస్‌టుడే, కావలి

బాస్కెట్‌బాల్ జిల్లా జట్ల ఎంపిక


క్రీడాకారులతో పీడీలు సురేశ్, సుబ్బారావు, శ్రీనివాసరావు

కందుకూరు గ్రామీణం, న్యూస్‌టుడే: ఉమ్మడి ప్రకాశం జిల్లా సబ్ జూనియర్ బాలబాలికల బాస్కెట్‌బాల్ జట్లను ఎంపిక చేసినట్లు పీడీ ఎస్. సురేశ్ తెలిపారు. టీఆర్ఆర్ కళాశాల క్రీడా మైదానంలో శనివారం ఈ ఎంపిక ప్రక్రియ చేపట్టారు. దీనికి 40మంది బాలబాలికలు హాజరయ్యారు. వీరిలో 12మంది బాలికలను, 12మంది బాలురను జిల్లా జట్టుకు ఎంపిక చేశారు. ఈ ఎంపికల్లో పీడీలు సుబ్బారావు, పి. శ్రీనివాసరావు, నరసింహం, చిట్టెమ్మ, రమాదేవి పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడికి గాయాలు

కావలి : పట్టణ శివార్లలోని మద్దూరుపాడు వద్ద జాతీయ రహదారిపై జరిగిన ప్రమాదంలో శివచేతన్ అనే యువకుడికి తీవ్ర గాయాలయ్యాయి. శనివారం బైక్‌పై వెళ్తుండగా అదుపుతప్పి బోల్తా కొట్టింది. గాయాలపాలైన యువకుడిని అతన్ని హైవే అంబులెన్స్‌లో కావలి ప్రాంతీయాసుపత్రికి తరలించారు. అక్కడ నుంచి మెరుగైన చికిత్స నిమిత్తం నెల్లూరుకు తీసుకెళ్లారు.

సమాచార హక్కు చట్టం ప్రాధాన్యత తెలుసుకోవాలి

కందుకూరు, గుడ్లూరు : ప్రతి ఒక్కరు సమాచార హక్కు చట్టం ప్రాధాన్యత తెలుసుకోవాలని ఏవో రవికుమార్ అన్నారు. స్థానిక ఏవో కార్యాలయంలో శనివారం చట్టం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. చట్టం ఉద్దేశం, ఉపయోగాలు, లక్ష్యాలు వివరించారు. అవినీతిని అరికట్టడం, ప్రభుత్వం వాటి విభాగాలు జవాబుదారీగా ఉండటం ప్రధాన ఉద్దేశమన్నారు. సర్పంచి శంకర్, వ్యవసాయ, ఉద్యాన సహాయకులు పాల్గొన్నారు.

కావలిలో పరిశ్రమలు స్థాపించండి


కేంద్రమంత్రితో భాజపా కావలి నాయకులు

కావలి, న్యూస్‌టుడే: నియోజకవర్గ సమస్యలు పరిష్కరించాలని భాజపా కావలి నాయకులు విన్నవించుకున్నారు. శనివారం నెల్లూరుకు వచ్చిన కేంద్ర భారీ పరిశ్రమలు, ఉక్కు సహాయమంత్రి భూపతిరాజు శ్రీనివాసవర్మను వారు కలసి ఈ మేరకు వివిధ సమస్యలు వివరించారు. కావలి చెంతనే రామాయపట్నం ఓడరేవు నిర్మాణ పనులు జరుగుతున్నందున స్థానికంగా భారీ పరిశ్రమలు స్థాపించాలని కోరారు. స్థానికంగా ఉండే యువతకు ఉపాధి అవకాశాలు మెరుగుపడేలా తోడ్పాటు అందించాలన్నారు. మంత్రిని కలసిన వారిలో భాజపా రాష్ట్ర కార్యదర్శి అంచిపాక కమల, కార్యవర్గ సభ్యులు గుండ్లపల్లి భరత్‌కుమార్, పట్టణ కమిటీ అధ్యక్షులు కుట్టుబోయిన బ్రహ్మానందం తదితరులున్నారు.

ప్రమాదంలో గాయపడిన యువతి మృతి

ఉలవపాడు : మండలంలోని వీరేపల్లి వద్ద జరిగిన ప్రమాదంలో గాయపడిన యువతి చికిత్స పొందుతూ శనివారం మృతిచెందింది. ఎస్సై అంకమ్మ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. అద్దంకి నుంచి తిరుమల దైవదర్శనానికి వెళ్తున్న తుఫాను వాహనం టైరు పగిలి అదుపుతప్పి రోడ్డుమార్జిన్లో ఉన్న కంటైనర్‌ను ఢీకొంది. దీంతో తుఫాను వాహనంలో ప్రయాణిస్తున్న 15మందిలో అయిదుగురు గాయపడ్డారు. వీరిలో మోరుబోయిన నక్షత్ర(14) కావలిలో చికిత్స పొందుతూ మృతిచెందినట్లు ఎస్సై వివరించారు. మరో నలుగురు చికిత్స పొందుతున్నారు.

ద్విచక్రవాహనం పైనుంచి జారిపడి..

ఉలవపాడు : తల్లీ కుమారుడు ద్విచక్రవాహనంపై ప్రయాణిస్తుండగా జారిపడి తల్లి మృతి చెందినట్లు ఎస్సై అంకమ్మ తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాలిలా ఉన్నాయి. ఉలవపాడు మండలం పెద్దపట్టపుపాలేనికి చెందిన తల్లి జాలమ్మ(70) తన కుమారుడి ద్విచక్రవాహనంపై కరేడు పంచాయతీ అలగాయపాలెం బంధువుల ఇంటికి వచ్చి వెళ్తుండగా మార్గమధ్యలో ఈ ప్రమాదం జరిగింది. పోలీసులు కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

వ్యవసాయ మోటార్ల తీగల చోరీ

లింగసముద్రం, న్యూస్‌టుడే: అంగిరేకులపాడు సమీపంలోని పొలాల్లో ఏర్పాటు చేసిన 20 మోటార్ల వైరు గుర్తుతెలియని వ్యక్తులు అపహరించారు. దీంతో నీటి సరఫరా నిలిచిపోయి పంటలు ఎండుతున్నాయని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విషయమై లింగసముద్రం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేస్తామన్నారు.

దాడి ఘటనపై కేసు

కావలి, న్యూస్‌టుడే: వైకుంఠపురానికి చెందిన కొమ్మి కొండపనాయుడిపై దాడి జరిగినట్లు శనివారం కావలి రెండో పట్టణ పోలీసులు కేసు నమోదైంది. బాధితుడి కుమార్తెను గతంలో అన్వేష్‌బాబుకు ఇచ్చి వివాహం చేశారు. ఆ తర్వాత కుమార్తె, అల్లుడు విడాకులు తీసుకున్నారు. న్యాయస్థాన ఉత్తర్వుల ప్రకారం మనవరాలు కుమార్తె సంరక్షణలోనే ఉన్నారు. అయితే, అన్వేష్ ఆ చిన్నారిని పాఠశాల వద్దకు వచ్చి కలుస్తుండటంతో కొండపనాయుడు అభ్యంతరం తెలిపారు. ఈ క్రమంలో దాడి జరిగినట్లుగా పోలీసులకు ఫిర్యాదు అందింది.

లలితాత్రిపుర సుందరిగా కనకదుర్గ


సీతారామపురం : అన్నపూర్ణాదేవి

కావలి, న్యూస్‌టుడే: దేవీ నవరాత్రుల్లో మూడో రోజు సందర్భంగా శనివారం కావలి పట్టణంలోని కనకదుర్గ ఆలయంలో అమ్మవారిని లలితాత్రిపురసుందరిగా అలంకరించారు. పాతూరు శివాలయంలో అమ్మవారికి అన్నపూర్ణ అలంకరణ చేశారు. బృందావనంలోని శ్రీవెంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా స్వామివారిని ఉదయం చిన్న శేషవాహనం, మధ్యాహ్నం స్నపన తిరుమంజనం, రాత్రి ముత్యపు పందిరి వాహనసేవలు నిర్వహించారు. మహాగౌరిగా కలుగోళమ్మ అలంకరణ చేశారు. ముసునూరులో గాయత్రి అలంకరణలో అమ్మవారు భక్తులకు దర్శనమిచ్చారు. సీతారామపురంలో అన్నపూర్ణాదేవిగా, వింజమూరులో రాజరాజేశ్వరిగా, వరికుంటపాడులో నాగార్పమ్మగా దర్శనమిచ్చారు. **దగదర్తి :** దగదర్తిలోని దుర్గాభవాని రామలింగేశ్వరస్వామి ఆలయంలో నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా శనివారం చండీహోమం నిర్వహించారు. ఉదయం రామలింగేశ్వరస్వామికి మహాన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకం, దుర్గాభవాని అమ్మవారికి సాముహిక కుంకుమార్చన నిర్వహించారు. భక్తులు పూజలు చేశారు.

జ్వాలా లక్ష్మీనృసింహస్వామి సేవలో భక్తజనం

వలేటివారిపాలెం, న్యూస్‌టుడే: పుణ్యక్షేత్రమైన మాలకొండలోని జ్వాలా లక్ష్మీనృసింహస్వామిని చూసి తరించేందుకు పలు ప్రాంతాల నుంచి భక్తజనం తరలివచ్చారు. శనివారం అర్చకులు లక్ష్మీనృసింహస్వామి, లక్ష్మీదేవి అమ్మవారిని అలంకరించి.. సంప్రదాయబద్ధంగా పూజలు చేశారు. మూలవిరాట్‌ను భక్తులు దర్శించారు. వలేటివారిపాలేనికి చెందిన వలేటి నాగేశ్వరరావు, ఆదిలక్ష్మీ దంపతుల పేరుపై ఆలయంలో ఉచిత అన్నసంతర్పణ చేశారు. ఒక్కరోజు స్వామివారికి వివిధ రూపాల్లో రూ. 11,47,318 ఆదాయం సమకూరినట్టు ఆలయ డిప్యూటీ కమిషనరు కేవీ సాగర్‌బాబు తెలిపారు.

ప్రసన్నుడి ఆలయంలో శ్రీచక్రార్చన


శ్రీచక్రార్చన సేవలందుకుంటున్న శ్రీదేవి, భూదేవి సమేత ప్రసన్నుడు

బిట్రగుంట: కొండబిట్రగుంట శ్రీప్రసన్న వెంకటేశ్వరస్వామి దేవస్థానంలో శ్రీచక్రార్చన శనివారం ప్రారంభమైంది. శ్రీదేవి, భూదేవితో కొలువుదీరిన శ్రీప్రసన్న వేంకటేశ్వరస్వామి ఉత్సవమూర్తుల ఎదుట శ్రీచక్రాన్ని ఉంచి అర్చన చేశారు. ప్రధానార్చకులు ఈపూరు సత్యనారాయణచార్యులు శ్రీచక్ర కుంకుమార్చన విశిష్టతను భక్తులకు వివరించారు. రాత్రి సహస్ర దీపాలంకరణ మండపంలో స్వామి దేవేరులతో పల్లకీసేవను అందుకున్నారు. అనంతరం జరిగిన ఊంజలసేవ భక్తిశ్రద్ధలతో సాగింది.

ఎన్ని మద్యం దుకాణాలకైనా దరఖాస్తు చేసుకోవచ్చు


దస్త్రాలను పరిశీలిస్తున్న డిప్యూటీ కమిషనర్ శ్రీనివాసరావు

ఉదయగిరి, న్యూస్‌టుడే: నూతన మద్యం విధానం ప్రకారం ఒక వ్యక్తి ఎన్ని మద్యం దుకాణాలకైనా దరఖాస్తు చేసుకోవచ్చని జిల్లా ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ డి. శ్రీనివాసరావు తెలిపారు. ఉదయగిరి ఎక్సైజ్ కార్యాలయాన్ని జిల్లా ఎన్‌ఫోర్స్‌మెంట్ సహాయ ఎక్సైజ్ సూపరింటెండెంట్ జగదీశ్వరరెడ్డితో కలిసి శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా దుకాణాలకు సంబంధించి దరఖాస్తులు స్వీకరిస్తున్న విధానాన్ని పరిశీలించారు. సీఐ లక్ష్మణస్వామి, సిబ్బందికి సూచనలిచ్చారు. ఈనెల 9వ తేదీ సాయంత్రం అయిదు గంటల్లోపు వచ్చిన దరఖాస్తులను పరిగణలోకి తీసుకోవటం జరుగుతుందన్నారు. 11న నెల్లూరు కస్తూర్బా కళాక్షేత్రంలో కలెక్టరు ఆధ్వర్యంలో డ్రా తీయటం జరుగుతుందన్నారు. ఎన్‌ఫోర్స్‌మెంట్ ఎస్సై పూర్ణకుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

అడ్డుకున్నందుకు దాడి

బిట్రగుంట : రేషన్ బియ్యం తరలింపును అడ్డుకున్నందుకు జలదంకి మండలం బ్రహ్మణక్రాకకు చెందిన సుబ్బారెడ్డి తనపై దాడికి పాల్పడ్డారని.. మేదరమెట్ల శేషారెడ్డి ఆరోపించారు. ఈ ఘటన శుక్రవారం రాత్రి 11.45గంటల ప్రాంతంలో బోగోలు మండలం బట్టినారయ్య ఇళ్ల సమీపంలో నాగవరపమ్మ గుడి వద్ద జరిగింది.

సమస్యలు పరిష్కరించాలని వినతి

కందుకూరు గ్రామీణం, న్యూస్‌టుడే: నియోజకవర్గంలో సమస్యల పరిష్కారం కోరుతూ అఖిలపక్షం ప్రతినిధుల బృందం సబ్‌కలెక్టర్ తిరుమణి శ్రీపూజకు శనివారం వినతిపత్రం అందజేశారు. ఇసుక అక్రమరవాణాను అరికట్టాలనీ, చుక్కల భూముల సమస్యల పరిష్కారం, రాళ్లపాడు ప్రాజెక్టుకు పూర్తిస్థాయి సిబ్బందిని ఏర్పాటు చేయాలని కోరారు. అఖిలపక్షం తరపున సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి పి. మాలకొండయ్య, సీపీఎం డివిజన్ నాయకులు జి. వెంకటేశ్వర్లు, రాళ్లపాడు రైతు సంఘం నాయకులు మాధవరావు, సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి బి. సురేశ్‌బాబు పాల్గొన్నారు.

బంగారు భవిష్యత్తుపై దృష్టి సారించండి

బిట్రగుంట, న్యూస్‌టుడే: ఇంజినీరింగ్ విద్యార్థులు తమ బంగారు భవిష్యత్తుపై దృష్టి సారించాల్సిన అవసరం ఉందని బిట్రగుంట ఎస్సై భోజ్యానాయక్ పేర్కొన్నారు. శనివారం బోగోలు మండలం కడనూతలలోని ఆర్ఎస్ఆర్ ఇంజినీరింగ్ కళాశాలలో ప్రిన్సిపల్ డాక్టర్ పీవీఎన్‌రెడ్డి అధ్యక్షతన ర్యాగింగ్‌పై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎస్సై భోజ్యానాయక్ మాట్లాడుతూ ర్యాగింగ్‌కు పాల్పడితే బలమైన చట్టాలకు బలికావాల్సి ఉంటుందని హెచ్చరిక చేశారు. కళాశాల ఏవో ఆర్‌వీ రమణారెడ్డి, ప్రొఫెసర్ కె. లక్ష్మీ, ఎన్ఎస్ఎస్ సమన్వయకర్త కిరణ్‌కుమార్ పాల్గొన్నారు.

నిలిచిన పనులు.. వాహనదారుల ఇబ్బందులు


పోట్లూరు వద్ద ఓ అంచు వద్ద పోసిన గ్రావెల్

గుడ్లూరు, న్యూస్‌టుడే: మండలంలోని పాజర్ల-పోట్లూరు మధ్య మూడు కి.మీ. దూరం నిర్మిస్తున్న తారురహదారి పనులు అర్ధాంతరంగా నిలిపేశారు. ఎంజీఎన్ఆర్ ఈజీఎస్ కింద పంచాయతీరాజ్ శాఖ ద్వారా ఈ రహదారి నిర్మాణానికి రూ. 60 లక్షలు మంజూరయ్యాయి. కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత రహదారి నిర్మించేందుకు చర్యలు తీసుకోవడంతో స్థానికులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

కనీస మరమ్మతులు లేకపోవడంతో..

గత ప్రభుత్వ హయాంలో ఈ మార్గానికి కనీస మరమ్మతులు చేయకపోవడంతో పాదచారులు, వాహనదారులు తీవ్ర అవస్థలు పడ్డారు. నిత్యం ద్విచక్రవాహనాల చక్రాలు మరమ్మతులకు గురయ్యేవి. ఈ మార్గంలో పోట్లూరు, పాజర్ల, స్వర్ణాజిపురం, వీరేపల్లి గ్రామాలకు చెందిన వారు రాకపోకలు చేస్తుంటారు.

ప్రారంభించిన పది రోజుల్లోనే..

ఆగస్టులో పనులు ప్రారంభించారు. పది రోజులు పనులు చేశారు. రహదారి అంచుల్లో గ్రావెల్ పరిచారు. వెంటనే పనులు నిలిపేశారు. అంచుల్లో పరుస్తున్న గ్రావెల్ పక్కనే ఉన్న అటవీశాఖ స్థలంలో తవ్వకాలు చేస్తుండటంతో ఆ శాఖ సిబ్బంది కొంత కాలం అడ్డుకున్నారు. కానీ, రహదారి పక్కనే గోతులు తీసి గ్రావెల్ పరిచారు. ఇరవై రోజులుగా పనులు ఆగిపోయాయి. కంకర తొలగి తీవ్ర అధ్వానంగా ఉన్న రహదారికి మంచిరోజులు వచ్చాయనుకుంటున్న వాహనదారులు పనులు నిలిపివేయడంతో అసహనం వ్యక్తం చేస్తున్నారు.


పాజర్ల సమీపంలో గ్రావెల్ ఇలా..

త్వరలో ప్రారంభిస్తాం

హనుమంతరావు, పీఆర్ జేఈ

గుత్తేదారు మరోచోట పనులు చేస్తున్నారు. దీంతో యంత్రసామగ్రి అక్కడ ఉంది. పది రోజుల్లో అక్కడ పనులు పూర్తయ్యే అవకాశం ఉంది. వెంటనే ఈ రహదారి పనులు ప్రారంభించేందుకు చర్యలు తీసుకుంటాం.

కోవూరు

• కోవూరు • సర్వేపల్లి • ఆత్మకూరు

అభివృద్ధి ఓర్వలేక కాకాణి విమర్శలు

ముత్తుకూరు, న్యూస్‌టుడే: తెదేపా హయాంలో ముత్తుకూరులో జరుగుతున్న అభివృద్ధి పనులను చూసి ఓర్వలేక మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి అసత్య ఆరోపణలు చేస్తున్నారని తెదేపా మండల ప్రధాన కార్యదర్శి మల్లికార్జున్ మండి పడ్డారు. ముత్తుకూరులో శనివారం ఆయన మాట్లాడుతూ... వైకాపా పాలనలో వైకుంఠధామం, సామాజిక భవనాల నిర్మాణం కూడా పట్టించుకోలేదన్నారు. తెదేపా పాలనలోనే అభివృద్ధి జరుగుతుందని పేర్కొన్నారు.

వర్షంతో ఉపశమనం

అనుమసముద్రంపేట, న్యూస్‌టుడే: ఏఎస్‌పేట మండలంలో శనివారం సాయంత్రం భారీ వర్షం కురిసింది. కొద్ది రోజులుగా ఎండల వేడిమికి అవస్థలు పడుతున్న ప్రజలకు ఉపశమనం కలిగించినట్లయింది. వర్షం రాకతో పల్లపుప్రాంతాల్లో నీరు నిలిచింది. దీంతో వాహనదారులు అవస్థలు పడాల్సిన పరిస్థితి ఏర్పడింది.

పరిశ్రమలు ఏర్పాటు చేయాలని వినతి

విడవలూరు, న్యూస్‌టుడే: కేంద్ర భారీ పరిశ్రమలు, ఉక్కు శాఖ సహాయ మంత్రి భూపతిరాజు శ్రీనివాసవర్మ నెల్లూరులోని ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి నివాసానికి శనివారం వచ్చారు. ఈ సందర్భంగా కేంద్రమంత్రిని కోవూరు నియోజకవర్గ తెదేపా నాయకులు బెజవాడ వంశీకృష్ణారెడ్డి మర్యాదపూర్వకంగా కలిసి నియోజకవర్గంలో పరిశ్రమలు ఏర్పాటుకు కృషి చేయాలని కోరారు.

సమస్య: పొదలకూరు మండలం మొగళ్లూరు, వావిలపల్లి గ్రామాల్లో విద్యుత్తు నియంత్రికల చోరీ జరిగి నెలలు గడుస్తున్నా కొత్తవి అమర్చలేదు. పంటలు ఎండిపోతున్నాయి. – సుబ్బానాయుడు, రైతు

సమాధానం: విద్యుత్తు నియంత్రికల చోరీపై పోలీసులకు ఫిర్యాదు చేశాం. వారు విచారిస్తున్నారు. ఎస్టిమేట్ నమోదు చేసే కొత్త నియంత్రికలు ఏర్పాటు చేస్తున్నాం. – శ్రీకాంత్, డిస్కం ఏఈ.

? విడవలూరు, చౌకచర్ల అరుంధతీవాడ, వావిళ్ల గ్రామాల్లో కుక్కలు స్వైర విహారం చేస్తున్నాయి. – గ్రామస్థులు

✔ పంచాయతీ కార్యదర్శులకు తెలియజేసి సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటాం. – నగేశ్‌కుమార్, ఎంపీడీవో

? ముత్తుకూరు మండలం పంటపాళెం పంచాయతీ పరిధిలోని అధిక సంఖ్యలో పామాయిల్ కర్మాగారాలతో పాటు, ఇతర కర్మాగారాలున్నాయి. వాహనాలు నిరంతరం తిరగడంతో వాటి నుంచి దుమ్ము, ధూళి, ఇతర కాలుష్యంతో ఇబ్బందులు పడుతున్నాం. – రమణయ్య, స్థానికుడు

✔ పంచాయతీ అధికారులను పంపి పరిశీలిస్తాం. కాలుష్య నియంత్రణకు చర్యలు తీసుకుంటాం. – నాగమణి, ఎంపీడీవో ముత్తుకూరు

జ్వాలాముఖి ఆలయాభివృద్ధికి కృషి



ఎమ్మెల్యే సోమిరెడ్డికి స్వాగతం పలుకుతున్న ఈవో, అర్చకులు

తోటపల్లిగూడూరు, మనుబోలు, న్యూస్‌టుడే: మండలంలోని వరిగొండలో వెలసిన జ్వాలాముఖి అమ్మవారి ఆలయ అభివృద్ధికి కృషిచేస్తానని సర్వేపల్లి శాసనసభ్యులు సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి అన్నారు. దసరా మహోత్సవాల సందర్భంగా అమ్మవారి ఆలయంలో శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఆలయ ప్రాంగణంలో కల్యాణ మండపం నిర్మాణానికి కృషిచేస్తామని హామీ ఇచ్చారు. పీహెచ్‌సీని సందర్శించి ఆవరణలో మొక్కలు నాటారు. ఆసుపత్రి అభివృద్ధికి కృషి చేస్తానని తెలిపారు.

సిబ్బంది నిర్లక్ష్యం.. సరఫరా వ్యవస్థ అస్తవ్యస్తం



గ్రామ సచివాలయం సమీపంలో కూలేందుకు సిద్ధంగా ఉన్న స్తంభం

న్యూస్‌టుడే, సంగం

మండలంలో ప్రధాన గ్రామమైన దువ్వూరులో విద్యుత్తు సరఫరా వ్యవస్థ అస్తవ్యస్తంగా ఉంది. డిస్కం సిబ్బంది నిర్లక్ష్యానికి అద్దం పడుతుంది. గాలులు వీస్తే సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని గ్రామస్థులు చెబుతున్నారు. సమస్యలు తీర్చాలని కోరుతున్నారు. గ్రామంలో 1097 గృహాలున్నాయి. 3,780 మంది జనాభా ఉన్నారు. గ్రామమంతటా 330 విద్యుత్తు స్తంభాలకు దీపాలు అమర్చారు. వాటితో పాటు చుట్టుపక్కల పంట పొలాలు, చేపల చెరువు లుండటంతో అదనంగా స్తంభాలున్నాయి. వాటిపై సింగిల్ ఫేజ్ నియంత్రికలు ఏర్పాటు చేశారు. కానీ అందుకు అనుగుణంగా నిర్వహణ సక్రమంగా లేకపోవడంతో పలు ప్రాంతాల్లో ప్రమాదకర స్థితిలో స్తంభాలు దర్శనమిస్తున్నాయి.

● నెల్లూరు ముంబయి జాతీయరహదారి నుంచి గ్రామం ప్రారంభంలోనే విద్యుత్తు స్తంభానికి పిచ్చి మొక్కల తీగలు అల్లుకోవడంతో ప్రమాదకరంగా ఉంది. దాన్ని తొలగించే తీరిక డిస్కం సిబ్బందికి లేకుండాపోయింది.

● పడమర ఎస్సీ కాలనీలో విద్యుత్తు తీగలు కిందికి వేలాడుతూ.. చేతికందే స్థాయిలో ప్రాణాంతకంగా ఉన్నాయి. నివాస గృహాల సమీపంలో చెట్ల మధ్య తీగలున్నాయి.



పడమర ఎస్సీ కాలనీలో చెట్ల మధ్య వేలాడుతున్న విద్యుత్తు తీగలు

● గ్రామసచివాలయం సమీపంలో ఉన్న విద్యుత్తు స్తంభం ఏ క్షణంలోనైనా కుప్పకూలేందుకు సిద్ధంగా ఉంది.

● గిరిజన కాలనీ సమీపంలో పొలాల వద్ద ఏర్పాటు చేసిన విద్యుత్తు నియంత్రిక తీగజాతి మొక్కలు అల్లుకోవడంతో గాలులు వీచినప్పుడు మంటలు వస్తున్నాయని గ్రామస్థులు చెబుతున్నారు.

● డిస్కం ఏ.ఈ మన్మథరావు మాట్లాడుతూ.. పరిశీలించి ఎలాంటి ఇబ్బందులు లేకుండా చేస్తామన్నారు.

ఆర్జీవో బాధ్యతల స్వీకరణ



ఆత్మకూరు, న్యూస్‌టుడే: ఆత్మకూరు ఆర్డీవోగా భూమిరెడ్డి పావని శనివారం బాధ్యతలు స్వీకరించారు. ఆత్మకూరు ఆర్డీవోగా పనిచేసిన మధులత నరసరావు పేటకు బదిలీ అయిన విషయం తెలిసిందే. ఆమె స్థానంలో పావని బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా తెదేపా నాయకులు పెంచలచౌదరి, కేతా విజయభాస్కర్‌రెడ్డి మల్లికార్జుననాయుడు, నారాయణ, తహసీల్దార్లు, సిబ్బంది కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

మహిళలను వేధిస్తే ఫిర్యాదు చేయండి

కోవూరు, న్యూస్‌టుడే: ఆసుపత్రుల్లో స్కానింగ్ కేంద్రాల్లో గర్భస్థ శిశువులను ఆడ, మగ అని గుర్తించడం నేరమవుతుందని లోక్ అదాలత్ జిల్లా చైర్మన్ రామశ్రీనివాసరావు తెలిపారు. పట్టణంలోని ఐసీడీఎస్ కార్యాలయంలో శనివారం సమావేశంలో పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ మహిళలకు ప్రత్యేక న్యాయవిజ్ఞాన సదస్సులో ఆయన పాల్గొన్నారు. మహిళలు పనిచేసే చోట ఎలాంటి అవమానాలు ఎదురైనా స్థానిక పోలీసులకు ఫిర్యాదు చేసే తక్షణమే వారికి న్యాయమందిస్తామన్నారు. కోవూరు సీనియర్ సివిల్ న్యాయమూర్తి చైతన్య, జిల్లా రిసోర్సుపర్సన్లు స్వరూప, ప్రశాంతి, సీడీపీవో జ్యోతి, న్యాయవాదులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న లోక్ అదాలత్ జిల్లా చైర్మన్ రామశ్రీనివాసరావు

పశువుల్లో గర్భకోశ వ్యాధులపై అవగాహన

మర్రిపాడు, న్యూస్‌టుడే: పశువుల్లో వచ్చే గర్భకోశ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని, ఎప్పటికప్పుడు వైద్యులను సంప్రదించాలని పశుసంవర్ధకశాఖ డీడీ శ్రీనివాసరావు పేర్కొన్నారు. శనివారం మర్రిపాడులో పాడిరైతులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం పాడిపశువులకు రూ.17 వేల విలువైన వ్యాధి నివారణ టీకాలు అందజేస్తుందని, రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. తెదేపా మండల కన్వీనర్ జనార్దన్‌నాయుడు, ఏడీ గురుజయంతి, పశువైద్యాధికారి నరేష్ తదితరులు పాల్గొన్నారు.

స్వల్పకాలిక రకాలతో అధిక దిగుబడులు

పొదలకూరు, న్యూస్‌టుడే: రబీ సీజన్‌లో అనుకూలమైన మధ్య, స్వల్పకాలిక వరి రకాలను రైతులు సాగుచేసుకోవాలని పొదలకూరు మండల వ్యవసాయాధికారి వాసు అన్నారు. శనివారం ఆయన మాట్లాడుతూ బీపీటీ-5204(జిలక మసూరి), అక్టోబరు 15 లోపు నార్లు పోసుకోవాలని కోరారు. స్వల్పకాలిక రకాల్లో కెఎన్ఎం-1635 (కూనవరం సన్నాలు), 120 రోజుల్లో పంట చేతికొస్తోందని, నవంబరు మొదటివారం నార్లు సిద్ధం చేసుకోవాలన్నారు. నారుపోసిన 25 నుంచి 30 రోజుల్లో నాటుకునేలా రైతులు చర్యలు తీసుకోవాలని కోరారు.

రేషన్ దుకాణంలో విజిలెన్సు అధికారుల దాడులు



తనిఖీలు నిర్వహిస్తున్న విజిలెన్సు అధికారులు

పొదలకూరు, న్యూస్‌టుడే: పొదలకూరు పట్టణంలోని 57వ నంబరు రేషన్ దుకాణంపై శనివారం సాయంత్రం విజిలెన్సు అధికారులు దాడులు నిర్వహించారు. విజిలెన్సు సీఐ శ్రీహరిరావు, తహసీల్దారు కృష్ణప్రసాద్ దాడులు చేసి బియ్యం, వంట నూనె, కందిపప్పు నిల్వల్లో తేడాలు గుర్తించి సీజ్ చేశారు. వినియోగదారులకు అందించే ఎండీయూ వాహనాన్ని కూడా సీజ్ చేసి 6ఏ కేసునమోదు చేసినట్లు తెలిపారు. దుకాణంలోని సరకులను పొదలకూరు సీఎస్ డీటీ రవికి అప్పగించారు.

అసంపూర్తిగా పాఠశాల భవనం



బుచ్చి నగర పంచాయతీలోని పెద్దూరులో పాఠశాల భవనం అసంపూర్తిగా ఉంది. నాడు-నేడు పనుల్లో భాగంగా అదనపు తరగతి గదులు, మరుగుదొడ్లు పూర్తి కాకుండా నిలిచిపోయాయి. ఎంఈవో దిలీప్‌కుమార్ మాట్లాడుతూ నిధులు రాకపోవడంతో ఆగిపోయాయని, నిధులు రాగానే పూర్తిచేయిస్తామన్నారు.

– న్యూస్‌టుడే, బుచ్చిరెడ్డిపాళెం

రోడ్డు అధ్వానం.. ప్రయాణికుల సతమతం

బుచ్చిరెడ్డిపాళెం నగర పంచాయతీలోని మలిదేవి కాలువ వద్ద రోడ్డు అధ్వానంగా ఉంది. సిమెంట్ రోడ్డు వేయాల్సిన చోట బూడిద వేశారు. గాలి వీస్తే దుమ్ముతో చుట్టుపక్కల ప్రజలు, వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. కమిషనర్ చంద్రశేఖర్‌రెడ్డి మాట్లాడుతూ ఆర్అండ్‌బి అధికారుల దృష్టికి తీసుకెళతామన్నారు.

– న్యూస్‌టుడే, బుచ్చిరెడ్డిపాళెం



పట్టించుకునేదెవరు




పొదలకూరు-నెల్లూరు ప్రధాన రహదారి పక్కనే ఉన్న మరుపూరు చెరువుకు నీరు సరఫరా చేసే వాగుపై నిర్మించిన వంతెనకు ఒక వైపు రక్షణ గోడ దెబ్బతింది. రాత్రివేళల్లో ఆ ప్రాంతంలో తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. రక్షణ గోడ దెబ్బతిని మూడేళ్లు గడుస్తున్నా నిర్మించలేదని వాహనదారులు వాపోతున్నారు. ఆర్అండ్‌బి ఏఈ శ్రీనివాసులు మాట్లాడుతూ ఇటీవల బాధ్యతలు స్వీకరించామని, పరిశీలించి చర్యలు తీసుకుంటామన్నారు.

– న్యూస్‌టుడే, పొదలకూరు, తోటపల్లిగూడూరు


తాగునీరు కలుషితం

మండలంలోని వీరంపల్లిలో తాగునీటి ట్యాంకు వద్ద పైపులైన్ లీకై నిత్యం నీరు వృథా అవుతోంది. కొన్ని రోజులుగా పేరుకుపోవడంతో కలుషితమవుతోంది. అధికారులు స్పందించి తాగునీటి వృథా అరికట్టాలని గ్రామస్థులు కోరుతున్నారు. ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ కసననాయక్ మాట్లాడుతూ పరిశీలించి మరమ్మతులు చేయించి నీటి వృథాను అరికట్టేందుకు చర్యలు తీసుకుంటామన్నారు.

– న్యూస్‌టుడే, మనుబోలు



ముందస్తు దసరా వేడుకలు



డిగ్రీ కళాశాలలో సరస్వతీ విగ్రహం వద్ద పూజలు చేస్తున్న అధ్యాపకులు, విద్యార్థులు

విడవలూరు, న్యూస్‌టుడే: విడవలూరులోని పీఆర్ ఆర్ అండ్ వీఎస్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ముందస్తు దసరా వేడుకలు శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా సరస్వతీ విగ్రహం వద్ద ప్రత్యేక పూజలు చేశారు. ధైర్యం, పట్టుదలకు దుర్గాదేవి స్ఫూర్తిదాయకమని ప్రిన్సిపల్ సుజాత అన్నారు. అమ్మవారి ప్రేమ, కరుణ విద్యార్థులపై ఉండాలని ఆకాంక్షించారు. అధ్యాపకులు మధు, ప్రియాంక, విద్యార్థులు పాల్గొన్నారు.

కారును ఢీకొన్న టిప్పర్



ప్రమాదానికి గురైన కారు

మనుబోలు, న్యూస్‌టుడే : టిప్పర్ అదుపుతప్పి కారును ఢీకొన్న ఘటన స్థానిక ప్రభుత్వాసుపత్రి ఎదురుగా జాతీయ రహదారిపై శనివారం జరిగింది. పోలీసులు, స్థానికుల వివరాల మేరకు గుంటూరుకు చెందిన ముగ్గురు కుటుంబ సభ్యులు బెంగళూరు నుంచి స్వగ్రామానికి వెళుతున్నారు. గూడూరు వైపు నుంచి నెల్లూరు వైపు వేగంగా వెళుతున్న టిప్పర్ అదుపుతప్పి కారును ఢీకొంది. ప్రమాద సమయంలో కారులో ఇద్దరు పిల్లలున్నారు. ఎవరికీ గాయాలు కాకపోవడంతో త్రుటిలో ప్రమాదం తప్పింది. టిప్పర్ ముందు కారు నిలిచిపోవడంతో వెనుక వస్తున్న వాహనాలు బారులు తీరడంతో ట్రాఫిక్ అంతరాయం ఏర్పడింది. పోలీసులు ఘటనాస్థలికి చేరుకుని పునరుద్ధరించారు.

చికిత్స పొందుతూ యువకుడి మృతి

వెంకటాచలం, న్యూస్‌టుడే: మండల పరిధిలోని ఈదగాలి పాతూరుకు చెందిన యశ్వంత్(17) చెన్నైలో ఒక ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతూ శనివారం మృతిచెందారు. వారం రోజుల క్రితం పొలంలో పని చేస్తుండగా అదుపుతప్పి పడిపోయారు. పొలంలో పిచికారి చేసేందుకు సిద్ధంగా ఉంచిన పురుగుల మందు అతని నోట్లో పడింది. వెంటనే చికిత్స నిమిత్తం చెన్నైకు తరలించగా చికిత్స పొందుతూ ప్రాణాలు కోల్పోయారు. వెంకటాచలం పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పోలీసుల అదుపులో నిందితులు

మర్రిపాడు, న్యూస్‌టుడే : మేకలను అపహరించి తీసుకువెళుతున్న ఆగంతుకులను చినమాచనూరు సెంటర్‌లో శనివారం స్థానికులు పట్టుకున్నారు. పట్టుబడిన వారిలో ముగ్గురు మహిళలు, ఒక పురుషుడు, ఇద్దరు చిన్నపిల్లలు ఉన్నారు. మరో ఇద్దరు పరారయ్యారు. పోలీసుల వివరాలమేరకు చినమాచనూరు సమీపంలో రెండు మేకలను పట్టుకొని ఆటలో తీసుకెళుతుండగా స్థానికులకు అనుమానం వచ్చి నిందితులను అడ్డుకున్నారు. పోలీసులకు సమాచారం ఇచ్చారు. నిందితులను అదుపులోకి తీసుకుని విచారిస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

పాహిమాం.. రక్షమాం

బుచ్చిరెడ్డిపాళెం, రాపూరు, తోటపల్లిగూడూరు, మనుబోలు, ముత్తుకూరు, రాపూరు, సైదాపురం, విడవలూరు, ఆత్మకూరు, ఏఎస్‌పేట, చేజర్ల, సంగం, న్యూస్‌టుడే: కోవూరు, సర్వేపల్లి, ఆత్మకూరు నియోజకవర్గాలతో పాటు సైదాపురం, కలువాయి, రాపూరు మండలాల్లో శరన్నవరాత్రి వేడుకలు శనివారం వైభవంగా జరిగాయి. బుచ్చి కనకదుర్గమ్మ ఆలయంలో అమ్మవారు అన్నపూర్ణాదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. కోదండరామ స్వామి ఆలయంలో విశేష అలంకరణ చేశారు. రాపూరు మండలం పెంచలకోనలో ఆదిలక్ష్మి అమ్మవారిని ధాన్యలక్ష్మి అలంకారం చేయగా భక్తులు పూజలు చేశారు. మనుబోలులో దేవాంగులవీధిలో అన్నపూర్ణాదేవి అలంకరణలో అమ్మవారు భక్తులకు దర్శనమిచ్చారు. పొదలకూరు శ్రీలక్ష్మీ గోదా సమేత వెంకటేశ్వరస్వామి ఆలయంలో శ్రీలక్ష్మీ దేవికి సంతానలక్ష్మి అలంకారం చేశారు. తోటపల్లిగూడూరు, ముత్తుకూరులో సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. విడవలూరులో అన్నపూర్ణాదేవీ అలంకరణలో అంకమ్మతల్లిని దర్శించుకున్నారు. సైదాపురంలోని బాలత్రిపుర సుందరీదేవి ఆలయంలో లక్ష్మీదేవి అలంకారంలో అమ్మవారికి మహిళలు సామూహిక పూజలు చేశారు. ఆత్మకూరు పట్టణంలోని జ్వాలాముఖి అమ్మవారు గాయిత్రీదేవి అలంకారణలో పూజలు అందుకున్నారు. చేజర్ల, కోటితీర్థం, కాకివాయి, చిత్తలూరు, ఆదూరుపల్లి గ్రామాల్లో ప్రత్యేక పూజా కార్యక్రమాలు చేపట్టారు. సంగంలో పెన్నానది తీరంలో కొలువై ఉన్న పోలేటి గంగమ్మ ఆలయంలో అమ్మవారు బాలా త్రిపుర సుందరీదేవిగా దర్శనమిచ్చారు. కామాక్షిదేవి సమేత సంగమేశ్వరాలయంలో లక్ష్మీదేవి అలంకారంలో కామాక్షిదేవి దర్శనమిచ్చారు.



పెంచలకోనలో..



పొదలకూరులో..



విడవలూరులో..



ఆత్మకూరులో..



సంగంలో..

హెచ్చరిక బోర్డులు ఏర్పాటు



రెవెన్యూ అధికారులు ఏర్పాటు చేసిన హెచ్చరిక బోర్డు

మర్రిపాడు, న్యూస్‌టుడే: మండలంలోని కదిరినేనిపల్లి రెవెన్యూలో కబ్జాకు గురైన ప్రభుత్వ భూముల్లో తహసీల్దారు స్వప్న హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయించారు. ఈ ఆక్రమణలపై ఈ నెల 3న 'ఆక్రమణల చెరలో ప్రభుత్వ భూములు' 4న 'పశువుల భూమి మేత' శీర్షికలతో 'ఈనాడు'లో ప్రచురితమైన కథనాలకు ఆమె స్పందించారు. వీఆర్వోను పంపి ఆక్రమణలకు గురైన భూముల్లో హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయించారు. ప్రభుత్వ భూములను ఆక్రమిస్తే కేసు నమోదు చేస్తామని హెచ్చరించారు.

అడ్డుకట్ట తొలగింపు

స్పందనకు వందనం



పెన్నానది దువ్వూరు కాలువ మధ్య అడ్డుకట్ట తొలగిస్తున్న యంత్రం

సంగం, న్యూస్‌టుడే: పెన్నానది నుంచి దువ్వూరు చెరువుకు సాగునీటి తరలింపునకు అధికారులు శనివారం చర్యలు చేపట్టారు. సంగం వద్ద దువ్వూరు కాలువ ప్రారంభ స్థానంలో తెలుగు గంగ విభాగం అధికారులు కొన్ని నెలల క్రితం అడ్డుకట్ట వేశారు. దాంతో దువ్వూరు చెరువుకు నీటి తరలింపు ఆగింది.. ఫలితంగా మండలంలో పలు గ్రామాల పరిధిలో తాగు, భూగర్భజలాలకు తీవ్ర ఇబ్బందులు ఏర్పడ్డాయి. గత నెల 22న 'దువ్వూరు చెరువుని ఎండగట్టారు' అనే శీర్షికన ఈనాడులో కథనం ప్రచురితమైంది. తెలుగుగంగ అధికారులు స్పందించి సాగునీటి సరఫరాకు ఉన్న అవరోధాల తొలగింపు పనులు ప్రారంభించారు. అన్నదాతలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

రైతుల ఖాతాల్లో రూ.2.67 కోట్ల జమ

కోవూరు, న్యూస్‌టుడే: కోవూరు వ్యవసాయ సబ్‌డివిజన్ పరిధిలో కోవూరు, కొడవలూరు, విడవలూరు, బుచ్చిరెడ్డిపాళెం, సంగం మండలాల్లోని 13366 మంది రైతుల ఖాతాల్లో పీఎం కిసాన్ పథకం కింద రూ. 2.67 కోట్లు శనివారం జమ చేశామని ఏడీఏ సుజాత తెలిపారు. పట్టణంలోని రైతుసేవా కేంద్రంలో శనివారం ఆమె మాట్లాడుతూ ఒక్కో రైతు ఖాతాలో రూ.2 వేలు చొప్పున జమ చేశామన్నారు. జిల్లా వ్యవసాయాధికారిణి సత్యవాణి రైతులకు పలు సూచనలు చేశారు. మండల వ్యవసాయాధికారిణి ఇందిరావతి పాల్గొన్నారు.

పవన్ కల్యాణ్‌పై విమర్శలు తగవు

వెంకటాచలం, న్యూస్‌టుడే: ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్‌పై వైకాపా నాయకుల విమర్శలు తగవని జనసేన సర్వేపల్లి నియోజకవర్గ ఇన్‌ఛార్జి సురేశ్ హెచ్చరించారు. వెంకటాచలంలోని పార్టీ కార్యాలయంలో శనివారం ఆయన మాట్లాడారు.

జరిమానాలతో ట్రాక్టర్ల విడుదల

అనంతసాగరం, న్యూస్‌టుడే: మండల పరిధిలోని పడమటి కంభంపాడు గ్రామం నల్ల చెరువులో అక్రమంగా మట్టి తరలిస్తూ పట్టుబడ్డ 11 ట్రాక్టర్లకు ఆత్మకూరు మోటర్ వెహికల్ ఇన్‌స్పెక్టరు జరిమానాలు విధించారు. అయిదు రోజుల క్రితం అనుమతులు లేకుండా మట్టి తరలిస్తున్న ట్రాక్టర్లను అదుపులోకి తీసుకున్నారు. మొదటి తప్పుగా భావించి ఒక్కో ట్రాక్టరుకు రూ.12 వేలకు పైగా జరిమానా విధించి ట్రాక్టర్లను విడుదల చేసినట్లు ఆత్మకూరు సీఐ గంగాధర్ తెలిపారు.

సంగం: అన్నారెడ్డిపాళెం పల్లిపాళెం సమీపంలోని పెన్నానది నుంచి ఇసుకను అక్రమంగా తరలిస్తున్న ట్రాక్టరుని శనివారం పోలీసులు పట్టుకుని కేసు నమోదు చేశారు.

ఇరు వర్గాల ఘర్షణ

వెంకటాచలం: మండలంలోని ఇడిమేపల్లిలో శనివారం రాత్రి రెండు వర్గాల మధ్య ఘర్షణ జరిగింది. ఇడిమేపల్లికి చెందిన వారు తమ గ్రామస్థులపై దాడి చేసి గాయపరిచారని, ఈదగాలికి చెందిన సుమారు 40 మంది ద్విచక్రవాహనాలపై అక్కడికి వెళ్లారు. రాత్రి 9:40 గంటల సమయంలో గ్రామానికి చేరుకొని పలువురిపై దాడికి పాల్పడ్డారు. ఇరు వర్గాల మధ్య ఘర్షణతో గ్రామంలో ఉద్రిక్తత పరిస్థితులు నెలకొన్నాయి. స్థానికులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. దీనిపై పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

విద్యుదాఘాతంతో సామగ్రి దగ్ధం

బుచ్చిరెడ్డిపాళెం: బుచ్చి నగర పంచాయతీ పెద్దూరులోని రమణయ్య ఇంట్లో విద్యుదాఘాతంతో సామగ్రి పూర్తిగా దగ్ధమవడంతో రూ. 1.5 లక్షలకు పైగా ఆస్తి నష్టం వాటిల్లింది. శనివారం రాత్రి జరిగిన ప్రమాదంతో ఫర్నిచర్, బీరువా, నగలు, నగదు అగ్నికి ఆహుతయ్యాయని బాధితుడు వాపోయారు. ఆరు నెలలుగా ట్రాన్స్‌ఫార్మర్ సమస్య ఉందని అధికారులకు చెబుతున్నా పట్టించుకోలేదన్నారు. ఉన్నతాధికారులు స్పందించి నష్ట పరిహారం అందించాలని కోరారు.

వెంకటగిరి నియోజకవర్గ సమాచారం

అన్నదానానికి విరాళం

రాపూరు, న్యూస్‌టుడే: పెంచలకోన ఆలయంలో అన్నదాన సత్ర నిర్వహణకు కడపకు చెందిన హరేంద్ర రూ. 1,01,632 లక్షల విరాళాన్ని శనివారం ఈవోకు అందజేశారు. ఆలయ సిబ్బంది ప్రత్యేక పూజలు నిర్వహించి దాతకు ప్రసాదాలు అందజేశారు.

కష్టపడి చదివితే ఉజ్వల భవిత

రాపూరు, న్యూస్‌టుడే: కష్టపడి చదివితే ఉజ్వల భవిత ఉంటుందని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ హనుమంతయ్య అన్నారు. కళాశాలలో శనివారం ఫ్రెషర్స్ డే ఘనంగా నిర్వహించారు. పలువురు మాట్లాడుతూ స్థానిక సమస్యలు ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేద్దామన్నారు. కార్యక్రమంలో అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

మండల సమాఖ్య ఎన్నిక వాయిదా

రాపూరు, న్యూస్‌టుడే: గ్రామ సంఘాల ఎన్నికలు ఏకపక్షంగా, నిబంధనలకు విరుద్ధంగా జరుగుతున్నాయని పొదుపు సంఘాలు అభ్యంతరం చెప్పడంతో శనివారం మండల సమాఖ్య అధ్యక్షురాలి ఎన్నిక వాయిదా పడింది. బదిలీ అయిన సీసీ సమక్షంలో ఎన్నిక నిర్వహించడంపై పలువురు ప్రశ్నించారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి నిబంధనల మేరకు జరిగేలా చూడాలని పేర్కొన్నారు.

చెంతనే ఉన్నా.. నిర్మాణదారులకు అవస్థలు

న్యూస్‌టుడే, కలువాయి, తోటపల్లిగూడూరు

సమీపంలో ఇసుక వనరులు పుష్కలంగా ఉన్నా తెచ్చుకునేందుకు అనుమతుల్లేక వేల రూపాయలు వెచ్చించి బయట ప్రాంతాల్లో కొనుగోలు చేస్తున్నారు. కోవూరు, సర్వేపల్లి నియోజకవర్గాలతో పాటు కలువాయి, సైదాపురం, రాపూరు మండలాల్లో ఈ పరిస్థితి నెలకొంది. సకాలంలో అందక పలు చోట్ల నిర్మాణాలు నిలిచిపోయాయి. కలువాయి మండల పరిధిలోని పలు చోట్ల అందుబాటులో ఉన్నా బయట ప్రాంతాల నుంచి ఎక్కువ ధరకు వెచ్చించి కొనుగోలు చేస్తున్నారు.

● సర్వేపల్లి నియోజకవర్గంలో వెంకటాచలం, తోటపల్లిగూడూరు, ముత్తుకూరు ప్రాంతాల్లో ఇసుక అందక ఇబ్బందులు పడుతున్నారు. కలువాయి మండలంలోని తెలుగురాయపురం, వెంకటరెడ్డిపల్లి, రాజుపాలెం సమీపంలోని పెన్నా పరివాహక ప్రాంతాల్లో పుష్కలంగా ఇసుక వనరులున్నాయి. ఎక్కడా తెచ్చేందుకు అనుమతులు లేకపోవడంతో ఇసుక కోసం భవన నిర్మాణదారులకు ఇబ్బందులు తప్పడం లేదు. పలు గ్రామాల్లోని ప్రజలు ఎడ్లబండి ద్వారా తెచ్చుకుంటున్నారు. చీపినాపి, కేశమనేనిపల్లి, పల్లకొండ, తిరుమలపాడు, దాసరపల్లి, దాచూరు, పెరంకొండ తదితర గ్రామాల వారికి ఇసుక కావాలంటే వాహనాల ద్వారా తెచ్చుకోవాలి. ట్రాక్టరుకు వేల రూపాయలు వెచ్చించాల్సి వస్తోందని నిర్మాణదారులు చెబుతున్నారు. కొందరు రాత్రి సమయాల్లో ఇసుక అక్రమ రవాణాకు పాల్పడుతున్నారు. మండలంలో తెలుగురాయపురం, వెంకటరెడ్డిపల్లి, రాజుపాలెం వద్ద ఉన్న ఇసుక రీచ్‌లకు అనుమతులివ్వాలని కోరుతున్నారు.



రాజుపాలెం వద్ద పెన్నా పరివాహక ప్రాంతం

● కలువాయి తహసీల్దారు శ్యాంసుందర్‌రాజు మాట్లాడుతూ రీచ్‌ల నుంచి ఇసుక తెచ్చుకునేందుకు ప్రభుత్వం అనుమతి ఇవ్వలేదన్నారు. ఎక్కువ మోతాదులో కావాలనుకుంటే జేసీ, ఇతర ఉన్నతాధికారులను సంప్రదించాలన్నారు.

నెల్లూరు

•నెల్లూరు •నెల్లూరు గ్రామీణం



హుండీ లెక్కింపులో సిబ్బంది

రంగనాథుని హుండీల ఆదాయం రూ.17.21 లక్షలు

నెల్లూరు(సాంస్కృతికం), న్యూస్‌టుడే: రంగనాయకులపేటలోని శ్రీ రంగనాథస్వామి దేవస్థానం హుండీలను శనివారం లెక్కించినట్లు ఆలయ ఈవో శ్రీనివాసులురెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. హుండీల ద్వారా రూ.17,21,022 ఆదాయం లభించిందన్నారు. పర్యవేక్షణ అధికారిగా దేవాదాయశాఖ ఇన్‌స్పెక్టర్ ఎ.సుధీర్ వ్యవహరించిన ఈ కార్యక్రమంలో ధర్మకర్తల మండలి ఛైర్మన్ మంచికంటి శ్రీనివాసులు, ధర్మకర్తలు పాల్గొన్నారు.

పార్టీ బలోపేతానికి కృషి చేయండి

నెల్లూరు(బృందావనం): సభ్యత్వం తీసుకుని భాజపాను బలోపేతం చేయాలని కేంద్ర సహాయ మంత్రి భూపతిరాజు శ్రీనివాసవర్మ ప్రజలను కోరారు. శనివారం ఆయన నెల్లూరు నగరంలో పర్యటించారు. ట్రంకు రోడ్డులో శివాజీ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. పలువురితో పార్టీ సభ్యత్వం నమోదు చేయించారు. జిల్లా భాజపా అధ్యక్షుడు వంశీధర్‌రెడ్డి, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దయాకర్‌రెడ్డి, రాష్ట్ర కార్యదర్శి కె.రాజేశ్వరి, రాష్ట్ర నాయకులు తదితరులు పాల్గొన్నారు.

❖ చింతారెడ్డి పాళెం-మెడికవర్ ఆసుపత్రి కూడలిలో వెహికల్ అండర్‌పాస్‌ను నిర్మించేందుకు చర్యలు తీసుకోవాలని కేంద్ర సహాయ మంత్రిని భాజపా వివిధ సెల్స్ రాష్ట్ర కన్వీనర్ సురేంద్ర రెడ్డి వినతి పత్రం అందించారు.

సమస్య: నగరంలోని 44వ డివిజన్ యడ్లవారివీధిలో చెత్త పేరుపోయి దుర్గంధం వస్తోంది. – ఖలీద్

సమాధానం: వ్యర్థాలను తొలగిస్తాం. – డాక్టర్ చైతన్య, ఆరోగ్యాధికారి

? రంగనాయకులపేట రోడ్డులో కుక్కల సమస్య అధికంగా ఉంది. రోడ్డుపై వెళ్లే వారిని కరుస్తున్నాయి. – రంగనాథ్

✓ కుక్కలను పట్టించేందుకుచర్యలు చేపడతాం. – డాక్టర్ మదన్‌మోహన్, వెటర్నరీ అధికారి

– న్యూస్‌టుడే, నెల్లూరు(నగరపాలకసంస్థ)

నెల్లూరువాసికి డాక్టరేట్ ప్రదానం



డాక్టరేట్ అందుకుంటున్న డాక్టర్ కృష్ణశ్రీ పద్మలత

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట), న్యూస్‌టుడే: నెల్లూరుకు చెందిన డాక్టర్ కృష్ణశ్రీ పద్మలతకు.. హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ నుంచి డాక్టరేట్ అందుకున్నారు. రెటినోబ్లాస్టోమా క్యాన్సర్ అనే అంశంపై చేసిన పరిశోధనకుగాను డాక్టరేట్ అందుకున్నారు. కృష్ణశ్రీ అనేక జాతీయ, అంతర్జాతీయ సమావేశాల్లో పాల్గొన్నారు. ఆమె పరిశోధనలు వివిధ శాస్త్రీయ పత్రికల్లో ప్రచురితమయ్యాయి. తనకు దక్కిన డిగ్రీ రావడంలో కుటుంబ సహకారం మరువలేనిదని కృష్ణశ్రీ శనివారం ఓ ప్రకటనలో తెలిపారు.

పంటకాలువల్లో పూడిక తీస్తేనే సాగునీరు

నెల్లూరు(విద్య), న్యూస్‌టుడే: పంటకాలువలు పూడికతో, గుర్రపు డెక్కతో నిండి ఉన్నాయని వీటిని తొలగించి.. రైతులకు సక్రమంగా సాగునీటిని అందించాలని రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు షానవాజ్ పేర్కొన్నారు. శనివారం నగరంలోని సీపీఐ కార్యాలయంలో రైతు సంఘం ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. సీపీఐ నగర కార్యదర్శి సయ్యద్ సిరాజ్, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి నందిపోగు రమణయ్య, కౌలురైతు సంఘం జిల్లా అధ్యక్షుడు నెల్లూరు రమణయ్య, చాంద్ బాషా తదితరులు పాల్గొన్నారు.

నిస్సీ.. ప్రతిభతో ఖుషీ

జాతీయ స్థాయి ఫుట్‌బాల్ పోటీలకు ఎంపిక

పిట్ట కొంచెం కూత ఘనం అన్నట్లు చిరుప్రాయంలోనే అద్భుత ప్రతిభ చూపుతోంది.. చిన్నారి. స్వయంకృషి, తండ్రి సహకారంతో అంచెలంచెలుగా ఎదుగుతూ ఫుట్‌బాల్ క్రీడలో జాతీయ స్థాయి పోటీలకు ఎంపికై స్ఫూర్తిగా నిలిచింది.. నెల్లూరుకు చెందిన నిస్సీ అభిరూప. – న్యూస్‌టుడే, నెల్లూరు(విద్య)

చుక్కన్న బాలిక.. అనతి కాలంలోనే క్రీడా నైపుణ్యాన్ని సాధించింది.

మొదటి స్థానం: స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో ఇటీవల జరిగిన రాష్ట్రస్థాయి పోటీల్లో నిస్సీ మొదటి స్థానంలో నిలిచింది. అద్భుతమైన ఆటను ప్రదర్శించి రాష్ట్ర



రాష్ట్ర స్థాయి పోటీల్లో విజేతగా సాధించిన కప్‌తో నిస్సీ అభిరూప

జట్టు ఎంపికల్లో పాల్గొని ఆంధ్రప్రదేశ్ ఫుట్‌బాల్ టీమ్‌లో చోటు దక్కించుకుంది. త్వరలో జమ్మూకశ్మీర్‌లో జరగనున్న జాతీయ పోటీల్లో పాల్గొననుంది. అంతర్జాతీయ స్థాయిలో మంచి పేరు తీసుకురావాలనేదే లక్ష్యం అంటోంది.. నిస్సీ.

నెల్లూరు నగరానికి చెందిన నిస్సీ అభిరూప.. ఐదవ సంవత్సరంలోనే ఫుట్‌బాల్ క్రీడపై ఆసక్తి పెంచుకుంది. ఉదయం, సాయంత్రం క్రమం తప్పకుండా సాధన చేసేది. శిక్షణ తీసుకుంటూ మెలకువలు నేర్చుకుంది. ఎక్కడ పోటీలు జరిగినా తప్పక పాల్గొనేది. తండ్రి ప్రైవేట్ పాఠశాలలో వ్యాయామ ఉపాధ్యాయుడు కావడంతో కూతురుకి ఫుట్‌బాల్ క్రీడలో శిక్షణ ఇచ్చారు. శిక్షణను అందిపు

సాధించిన విజయాలు

2015లో నెల్లూరులో జరిగిన ఫుట్‌బాల్ పోటీల్లో పాల్గొంది. ఆటతీరును తిలకించిన అప్పటి కలెక్టర్ జానకి స్వయంగా ఫుట్‌బాల్ అందించారు. 2020లో జిల్లా స్థాయి పోటీల్లో తన్వదైన ఆటతీరును ప్రదర్శించింది. 2021లో రాష్ట్రస్థాయిలో ఫుట్‌బాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో విశాఖపట్నంలో జరిగిన పోటీల్లో విజేతగా నిలిచి రూ.2000 నగదు బహుమతి అందుకుంది. 2022లో తాడేపల్లిగూడెంలో జరిగిన అండర్-14 స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ ఇంటర్ డిస్ట్రిక్ ఫుట్‌బాల్ పోటీల్లో మొదటి స్థానంలో నిలిచింది. గత ఏడాది పశ్చిమ గోదావరి జిల్లాలో జరిగిన ఆంధ్రటీమ్ ఎంపికల్లో పాల్గొని ఏపీ టీమ్‌కు ఎంపికైంది. అదే సంవత్సరం జాతీయ స్థాయిలో మణిపూర్‌లో జరిగిన పోటీల్లో తన్వదైన ఆటతీరును ప్రదర్శించింది. గత ఏడాది జోనల్ స్థాయిలో తిరుపతిలో జరిగిన పోటీల్లో విజేతగా నిలిచి బంగారు పతకాన్ని అందుకుంది. అదే సంవత్సరం కర్ణాటక రాష్ట్రం బెల్గాంలో జరిగిన సబ్ జూనియర్స్ బాలికల నేషనల్ ఫుట్‌బాల్ ఛాంపియన్‌షిప్ పోటీల్లో తన్వదైన ఆటతీరును ప్రదర్శించి ప్రశంసలు అందుకుంది. గతనెలలో పల్నాడు జిల్లా వినుకొండలో జరిగిన రాష్ట్రస్థాయిలో స్కూల్‌గేమ్స్ ఫెడరేషన్ ఫుట్‌బాల్ పోటీల్లో బంగారు పతకం అందుకుంది. త్వరలో జాతీయస్థాయిలో జమ్మూకశ్మీర్‌లోని శ్రీనగర్‌లో జరగనున్న అండర్-17 జాతీయస్థాయి పోటీలకు శిక్షణ తీసుకుంటోంది.

మముబ్రోవగరావే మాయమ్మ

నెల్లూరు (సాంస్కృతికం), న్యూస్‌టుడే: శరన్నవరాత్రి ఉత్సవాలలో అమ్మవారి అంకరణలు భక్తులకు కనువిందు చేస్తున్నాయి. శనివారం అమ్మవార్లు వివిధ అలంకరణల్లో కొలువుదీరి భక్తులకు దర్శనమిస్తున్నారు. అమ్మవారి సన్నిధిలో మహిళలు సామూహిక కుంకుమ పూజలు నిర్వహించారు.



నరసింహకొండపై ధైర్యలక్ష్మీగా... బాలాత్రిపుర సుందరిగా భువనేశ్వరి.. దుర్గా అలంకరణలో అష్టలక్ష్మి అమ్మవారు

వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయంలో గాయత్రిగా.. బాలాజీనగర్‌లో మీనాక్షిగా.. అరిగెలవారి వీధిలో అన్నపూర్ణగా

ఏపీ టెట్‌కు 108 మంది గైర్హాజరు

నెల్లూరు(విద్య), న్యూస్‌టుడే: జిల్లా వ్యాప్తంగా ఏర్పాటు చేసిన కేంద్రాల్లో శనివారం ఏపీ టెట్ పరీక్ష కొనసాగింది. పరీక్షకు ఉదయం, మధ్యాహ్నం 941 మంది అభ్యర్థులు హాజరు కావాల్సి ఉండగా.. 108 మంది గైర్హాజరయ్యారు. పరీక్షను జిల్లా విద్యాశాఖాధికారి పీవీజే రామారావు పర్యవేక్షించారు.

కేంద్ర సహాయ మంత్రితో ఎంపీ వేమిరెడ్డి భేటీ

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట): కేంద్ర సహాయ మంత్రి భూపతిరాజు శ్రీనివాస వర్మతో నెల్లూరు ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి తన నివాసంలో శనివారం మర్యాదపూర్వకంగా భేటీ అయ్యారు. జిల్లాలో పారిశ్రామిక అభివృద్ధికి తీసుకోవాల్సిన చర్యలపై మంత్రి దృష్టికి ఎంపీ తీసుకువెళ్లారు.

ఉక్రోశంతోనే సోమిరెడ్డి విమర్శలు

నెల్లూరు(నగరపాలకసంస్థ), న్యూస్‌టుడే: తాను చెప్పిన పనులు అధికారులు చేయడం లేదనే ఉక్రోశంలో ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి ఉన్నారని మాజీమంత్రి, వైకాపా జిల్లా అధ్యక్షుడు కాకాణి గోవర్ధన్‌రెడ్డి అన్నారు. శనివారం నెల్లూరులోని వైకాపా జిల్లా కార్యాలయంలో విలేకరుల సమావేశాన్ని నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ సోమిరెడ్డి నిత్యం గ్రావెల్, మట్టి అమ్ముకుని సంచులు నింపుకొంటున్న మాట వాస్తవం కాదా అని ప్రశ్నించారు. విజయవాడ వరద బాధితుల పేరుతో కంపెనీలు, వ్యాపారుల నుంచి రూ.2కోట్లు దండుకుని స్వాహా చేశారని ఆరోపించారు. దొంగ కేసులు పెట్టి ఇబ్బంది పెడితే.. తమ ప్రభుత్వం వచ్చిన తర్వాత చర్యలు ఉంటాయన్నారు.

వీవోఏల సమస్యలు పరిష్కరించాలి

నెల్లూరు(కలెక్టరేట్): వీవోఏలకు ఉద్యోగ భద్రత కల్పించాలని, తొలగింపులు ఆపాలని, జీతాల బకాయిలు చెల్లించాలని వీవోఏల జిల్లా కన్వీనర్ అన్నపూర్ణమ్మ పేర్కొన్నారు. వీవోఏల సమస్యలు పరిష్కరించాలని శనివారం కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించి డీఆర్వో వినతిపత్రం అందించారు.

శుభ్రం చేస్తే.. ఘాట్‌కు కొత్తకళ

నవాబుపేటలోని జాఫర్‌సాహెబ్ కాలువ వద్ద కనుమ పార్వేట తెప్పోత్సవాన్ని నిర్వహించేందుకు నిర్మించిన ఘాట్ వద్ద కాలువ వ్యర్థాలతో నిండిపోయింది. ఏడాదికి ఒకసారి కనుమరోజు మల్లేశ్వరస్వామికి తెప్పోత్సవం నిర్వహించిన తరువాత ఘాట్ పరిసరాలు నిరుపయోగంగా ఉంటున్నాయి. కాలువలో వ్యర్థాలు తొలగిస్తామని నగరపాలక ఆరోగ్యాధికారి డాక్టర్ చైతన్య తెలిపారు. – న్యూస్‌టుడే, నెల్లూరు(సాంస్కృతికం)



అభివృద్ధి పనుల పేరుతో రోడ్ల ధ్వంసం



అభివృద్ధి పనుల పేరుతో రోడ్లను ధ్వంసం చేసి ఆ తరువాత పట్టించుకోవడం లేదు. ఫలితంగా రాకపోకలకు నగరవాసులు ఇబ్బందులు పడుతున్నారు. నెల్లూరు నగరంలోని గాంధీబొమ్మ సెంటరు నుంచి స్వతంత్ర పార్కుకు వెళ్లే రోడ్డును తవ్వి నామమాత్రంగా మరమ్మతులు చేసి వదిలేశారు. వర్షాలకు గుంతలు పడి ప్రమాదకరంగా మారింది. మరమ్మతులు చేయిస్తామని నగరపాలక ఇంజినీరింగ్ అధికారులు తెలిపారు.

– న్యూస్‌టుడే, నెల్లూరు(నగరపాలకసంస్థ)

సిమెంటు పలకలు పగిలినా.. పట్టించుకోరా?

మద్రాసు బస్టాండు సమీపంలోని సరోజినీనగర్‌లో వాల్వు గుంతపై ఉన్న సిమెంటు పలకలు పగిలిపోయాయి. ఏ మాత్రం అజాగ్రత్తగా ఉన్నా.. ప్రమాదం పొంచి ఉంది. ఇదే ప్రాంతంలో జిల్లా రిజిస్ట్రార్ కార్యాలయం, రెడ్‌క్రాస్ ఉండటంతో నిత్యం వందలాది మంది ప్రజలు రాకపోకలు సాగిస్తుంటారు. అధికారులు స్పందించి వాల్వు గుంతపై రక్షణ చర్యలు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు. సిమెంటు పలకలు ఏర్పాటు చేస్తామని నగరపాలక ఇంజినీరింగ్ అధికారులు తెలిపారు. – న్యూస్‌టుడే, నెల్లూరు(టౌన్)



కాలువ ఆక్రమణ.. రహదారిపై మురుగు



నగరంలోని వాకర్స్‌రోడ్డులో స్థానికంగా ఉన్న అపార్టుమెంటు వారు కాలువను ఆక్రమించి ర్యాంపు నిర్మించారు. కాలువలో పూడికతీత చేపట్టేందుకు వీలుకాక మురుగు, వర్షపునీరు రోడ్డుపై చేరుతోంది. మురుగునీటిలో వాహనాలు వెళ్లే సమయంలో పాదచారులపై పడుతున్నాయని వాపోతున్నారు. కాలువలో పూడికను తీయించి సమస్యను పరిష్కరిస్తామని ఆరోగ్యాధికారి డాక్టర్ చైతన్య తెలిపారు.

– న్యూస్‌టుడే, నెల్లూరు(పొదలకూరురోడ్డు)

ఎన్‌కౌంటర్‌పై న్యాయవిచారణ జరిపించాలి



గోడప్రతులు ప్రదర్శిస్తున్న పౌరహక్కుల సంఘం నాయకులు

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట), న్యూస్‌టుడే: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు దుర్మార్గపు ఆలోచనలతో విశాల దండకారణ్యంలోని ఆదివాసుల జీవితాలను ఛిద్రం చేస్తూ దమనకాండను కొనసాగిస్తున్నాయని పౌరహక్కుల సంఘం జిల్లా కార్యదర్శి ఎల్లంకి వెంకటేశ్వర్లు అన్నారు. నగరంలోని డాక్టర్ విజయ్‌కుమార్ నెల్లూరు హాస్పిటల్‌లోని సెల్లార్‌లో శనివారం సాయంత్రం సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఛత్తీస్‌గఢ్‌లో జరిగిన ఎన్‌కౌంటర్‌లో పెద్దఎత్తున చనిపోయారని తెలిపారు. ఎన్‌కౌంటర్‌పై సుప్రీం కోర్టు సుమోటో కేసుగా స్వీకరించి న్యాయ విచారణ జరిపి దోషులను శిక్షించాలన్నారు. సమావేశంలో నాయకులు అబ్బాయిరెడ్డి, బ్రహ్మం, ప్రసాద్, శీనయ్య, రవి, నారాయణ తదితరులు పాల్గొన్నారు.

వాహనదారులకు ఇబ్బందులు లేకుండా చేస్తాం

నెల్లూరుగ్రామీణం, న్యూస్‌టుడే: వాహనదారులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చేస్తామని నెల్లూరు రూరల్ నియోజకవర్గ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి అన్నారు. వనంతోపు ఎస్సీ కాలనీలో అధికారులతో కలిసి ఆయన శనివారం పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బైపాస్‌రోడ్డుకు అతిదగ్గరగా ఉన్న కాలనీ మార్గంలో రెండు రోజుల్లో అధికారులు సమస్యలపై సర్వే చేసి రిపోర్ట్ ఇస్తారన్నారు. పరిశీలించి చర్యలు తీసుకుంటామన్నారు. నాయకులు భాస్కర్, కార్పొరేటర్ చేజర్ల మహేష్ బాబు, దారా మల్లి, ఖాదర్‌భాషా, రవీందర్‌రెడ్డి, అన్నంగి రమణయ్య పాల్గొన్నారు.

క్రికెట్ విజేత నారాయణ వైద్య కళాశాల



క్రికెట్ కప్‌తో నెల్లూరు వైద్య కళాశాల విద్యార్థులు

తిరుపతి (వైద్యవిభాగం), న్యూస్‌టుడే: పీజీ వైద్య విద్యార్థుల రాష్ట్రస్థాయి క్రికెట్ పోటీల విజేతగా నెల్లూరు నారాయణ వైద్య కళాశాల నిలిచింది. డా.ఎన్టీఆర్ ఆరోగ్య విశ్వవిద్యాలయం, నేషనల్ మెడికల్ కౌన్సిల్ ఆదేశాల మేరకు ఎస్వీ వైద్య కళాశాల ఆధ్వర్యంలో ఈ పోటీలు జరిగాయి. తుదిపోరులో శ్రీకాకుళం జేమ్స్ వైద్యకళాశాల జట్టుతో నారాయణ జట్టు తలపడింది. మ్యాన్ ఆఫ్ ది టోర్నమెంట్‌గా గుంటూరు ఎన్ఆర్ఐ వైద్య కళాశాల పీజీ విద్యార్థి డా.వినీత్ నిలిచారు. విజేతలకు కళాశాల ప్రిన్సిపల్ చంద్రశేఖరన్ జ్ఞాపికలు అందజేశారు. వైస్ ప్రిన్సిపాళ్లు డా.వెంకటేశ్వర్లు, డా.తులసీరామ్, డా.పాహీం తదితరులు పాల్గొన్నారు.

టిడ్కో నివాస ప్రాంత సమస్యలపై దృష్టి

నెల్లూరు (వేదాయపాలెం), న్యూస్‌టుడే: టిడ్కో నివాస ప్రాంతాల అభివృద్ధి, అక్కడి సమస్యలపై టిడ్కో ఛైర్మన్, జనసేన పార్టీ జాతీయ మీడియా అధికార ప్రతినిధి వేములపాటి అజయ్‌కుమార్ ప్రత్యేక దృష్టిసారించినట్లు జనసేన నాయకులు నూనె మల్లికార్జున యాదవ్ తెలిపారు. శనివారం జనసేన నాయకులతో కలిసి భగత్‌సింగ్ కాలనీ, అల్లీపురంలో ఉన్న టిడ్కో నివాసాలను పరిశీలించారు. కార్యక్రమంలో జనసేన రాష్ట్ర సంయుక్త కార్యదర్శి సుందర రామిరెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి గునుకుల కిషోర్, లాయర్ శ్రీరామ్, కృష్ణారెడ్డి, బోనుబోయిన ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ఐశ్వర్య ఫెర్టిలిటీ సెంటరు ప్రారంభం



జ్యోతి వెలిగించి కేంద్రాన్ని ప్రారంభిస్తున్న డీఎంహెచ్‌వో డాక్టర్ పెంచలయ్య

నెల్లూరు (టౌన్), న్యూస్‌టుడే: నెల్లూరు నగరంలోని కేవీఆర్ పెట్రోలు బంకు సమీపంలోని సరస్వతినగర్‌లో ఐశ్వర్య ఫెర్టిలిటీ సెంటరును శనివారం డీఎంహెచ్‌వో డాక్టర్ పెంచలయ్య ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ నెల్లూరులో 55వ బ్రాంచ్‌ని ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. వ్యవస్థాపకులు డాక్టర్ ఎస్.చంద్రలేఖ మాట్లాడుతూ 37 ఏళ్లుగా 1.5 లక్షల మంది భార్యాభర్తలకు వైద్య సేవలు అందించినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఐఎంఏ నగర అధ్యక్షుడు డాక్టర్ అమర్‌నాథ్‌రెడ్డి, డాక్టర్ రాజి పిళ్లై, వైద్యులు పాల్గొన్నారు.

నగరాభివృద్ధికి చర్యలు



మాట్లాడుతున్న మంత్రి నారాయణ

నెల్లూరు(నగరపాలకసంస్థ), న్యూస్‌టుడే: నెల్లూరు నగరాభివృద్ధికి చర్యలు చేపడుతున్నట్లు మంత్రి డాక్టర్ పొంగూరు నారాయణ తెలిపారు. శనివారం నగరపాలకసంస్థ కార్యాలయంలో అధికారులతో సమావేశం నిర్వహించారు. వరదల సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, నగర అభివృద్ధి తదితర విషయాలపై అధికారులకు దిశానిర్దేశం చేశారు. ఆయన మాట్లాడుతూ విజయవాడ వరద బాధితులకు తమ నారాయణ సంస్థల పిల్లలు రూ.2.50కోట్లు ఇచ్చినట్లు తెలిపారు. సమాశంలో జేసీ కలెక్టర్ కార్తీక్, కమిషనర్ సూర్యతేజ, డిప్యూటీ మేయర్ రూప్‌కుమార్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

సబ్‌స్టేషన్ ప్రారంభం

నెల్లూరు(విద్య): నగర ప్రజలకు అంతరాయం లేని విద్యుత్తును అందించేందుకు బోడిగాడితోటలో రూ.3.60 కోట్లతో నూతనంగా ఏర్పాటు చేసిన 33/11 కేవీ సబ్‌స్టేషన్‌ను మంత్రి నారాయణ శనివారం ప్రారంభించారు. కార్యక్రమంలో విద్యుత్తు శాఖ ఎస్ఈ వి.విజయన్, నెల్లూరు టౌన్ ఈఈలు శ్రీధర్, పరందామయ్య, శేషాద్రి బాలచంద్ర, రాఘవేంద్ర, సుధాకర్, డిప్యూటీ ఈఈలు సునీల్, కిరణ్, ఏఈలు కుమార్, సురేష్, గోపాలకృష్ణ, మునిశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట): వారం సమయం ఇస్తున్నా.. నగరంలో ఒక్క పోస్టర్ కూడా కనిపించకూడదు... కనిపిస్తే చూస్తూ ఊరుకోనని.. మంత్రి నారాయణ తెలిపారు. ఆత్మకూరు బస్టాండ్ ఫ్లైఓవర్ కింద ఉన్న గోడలు, పిల్లర్లకు అంటించిన పోస్టర్లను శనివారం సాయంత్రం స్వయంగా తొలగించారు.

మోడల్‌సిటీకి శ్రీకారం

నెల్లూరు(నవాబుపేట): అధునాతన సాంకేతికతను ఉపయోగించి రహదారుల నిర్వహణకు రోడ్డు రన్నర్ వాహనం ద్వారా అంచనాలు వేస్తామని మంత్రి నారాయణ తెలిపారు. నగరంలోని ముత్తుకూరు గేటు వద్ద రోడ్ల నిర్వహణ కోసం ప్రత్యేకంగా సెన్సార్ ద్వారా పనిచేసే రోడ్డు రన్నర్ వాహనాన్ని మంత్రి శనివారం లాంఛనంగా ప్రారంభించారు. కమిషనర్ సూర్యతేజ, వాహన ఇంజినీర్లు, తెదేపా నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

అరకొర సేవలే.. సచివాలయాల్లో రిజిస్ట్రేషన్ల నిలిపివేత

న్యూస్‌టుడే, నెల్లూరు(కలెక్టరేట్)

భూములు, ఇళ్లు అమ్మినా.. కొన్నా.. రిజిస్ట్రేషన్ కార్యాలయాల చుట్టూ తిరగనక్కర్లేదని.. గ్రామ, వార్డు సచివాలయాల్లోనే అన్ని సేవలు అందుబాటులో ఉన్నాయని గత వైకాపా ప్రభుత్వం గొప్పలు చెప్పుకొంది. సచివాలయాల్లో సౌకర్యాల లేమితో రిజిస్ట్రేషన్లు సరిగా జరగక ప్రజలు ఇబ్బందులు పడేవారు. కూటమి ప్రభుత్వం సచివాలయాల్లో రిజిస్ట్రేషన్ సేవలు నిలిపివేస్తూ జీవో విడుదల చేసింది.

నగరంలో 12 ప్రాంతాల్లో..: జిల్లా వ్యాప్తంగా ఎంపిక చేసిన 122 సచివాలయాల్లో, నెల్లూరు నగరంలోని 12 ప్రాంతాల్లో రిజిస్ట్రేషన్ సేవలు అంటూ నాటి వైకాపా ప్రభుత్వం చెప్పినా.. కక్షిదారులు ఎక్కువ మంది రిజిస్ట్రేషన్లకు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలకే వచ్చేవారు. యూజర్లు, లాగిన్లు ఇచ్చినా కేవలం సేల్, గిఫ్ట్, మార్ట్‌గేజ్, వీలునామాల్లో కొన్ని సేవలే సచివాలయాల్లో అందుబాటులో ఉండేవి. వైకాపా హయాంలో అధికారుల



నెల్లూరు రిజిస్ట్రేషన్ కార్యాలయం వద్ద జనం

ఒత్తిడి కారణంగా రిజిస్ట్రార్ కార్యాలయాల్లో కాకుండా కేవలం సచివాలయాల్లోనే బలవంతంగా రిజిస్ట్రేషన్ల ప్రక్రియ చేపట్టేవారు. సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలకు చెందిన ఉద్యోగులే ఆయా సచివాలయాలకు వెళ్లి రిజిస్ట్రేషన్ల ప్రక్రియ చేపట్టేవారు.

● రిజిస్ట్రార్ హరివర్మ మాట్లాడుతూ ప్రభుత్వం సచివాలయాల్లో రిజిస్ట్రేషన్లు నిలిపివేసిందని తెలిపారు.

సామగ్రి లేక అవస్థలు

సచివాలయాల్లో ఈకేవైసీకి ఉపయోగించే ప్రత్యేక మంత్రా డివైజ్, ఫొటో తీసేందుకు వెబ్ కెమెరాలు లేకపోవడంతో రిజిస్ట్రేషన్ల ప్రక్రియకు అంతగా ఉపకరించడం లేదని రిజిస్ట్రేషన్ శాఖ ఉద్యోగులు ఉన్నతాధికారులకు మొరపెట్టుకున్నారు. అవసరమైన స్కానర్, హైస్పీడ్ నెట్ అందుబాటులో లేక రిజిస్ట్రేషన్ల ప్రక్రియలో తీవ్ర జాప్యంతో క్రయ, విక్రయదారులు ఇబ్బందులు పడ్డారు. సచివాలయాల వారీగా యూజర్ కోడ్‌లు ఇచ్చి రిజిస్ట్రేషన్ల ప్రక్రియ మొదలుపెట్టినా డాక్యుమెంట్‌లో స్థలం, వారసత్వపు హక్కులకు సంబంధించిన పదప్రయోగంలో ఏమాత్రం తప్పులు దొర్లినా సరి చేసుకునేందుకు రిజిస్ట్రార్ కార్యాలయాల చుట్టూ తిరగాల్సి వచ్చేంది. దాంతో రిజిస్ట్రేషన్లకు ప్రజలు ఆసక్తి చూపలేదు. కూటమి ప్రభుత్వం సచివాలయాల్లో రిజిస్ట్రేషన్లు నిలుపుదల చేయడంతో రిజిస్ట్రేషన్ల కార్యాలయాలు మళ్లీ కళకళలాడుతున్నాయి.

ముగ్గురు దుకాణదారులపై కేసు

నెల్లూరు(నేర విభాగం): ఆటో నగర్‌లో స్పేర్స్ అండ్ సేల్స్ దుకాణంలో పనిచేస్తున్న ఇద్దరు బాలురను, ఓల్డ్ స్పేర్స్ దుకాణంలో పనిచేస్తున్న ఒకరిని, ఏసీ ఎలక్ట్రికల్ దుకాణంలో పనిచేస్తున్న ఇద్దరిని ఐసీడీఎస్ అధికారులు శనివారం సంరక్షించారు. వారి తల్లిదండ్రులకు కౌన్సెలింగ్ ఇచ్చి అప్పగించారు. దుకాణదారులపై ఐసీడీఎస్ ప్రతినిధి సమత వేదాయపాలెం పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

గొలుసు అపహరణ

నెల్లూరు(నేర విభాగం): వృద్ధురాలి మెడలోని గొలుసును గుర్తుతెలియని దుండగులు లాక్కెళ్లారు. ఈ ఘటన నగరంలోని నేతాజీ స్కూలు సమీపంలో చోటు చేసుకుంది. వెంకటరామపురానికి చెందిన పద్మావతి శనివారం ఉదయం వాకింగ్ చేస్తుండగా గుర్తు తెలియని ఇద్దరు దుండగులు బైక్‌పై వచ్చారు. ఆమె మెడలోని రెండు సవర్ల బంగారు గొలుసును తెంపుకెళ్లారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు బాలాజీనగర్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

భార్య కాపురానికి రాలేదని ఆత్మహత్య

నెల్లూరు(నేర విభాగం), న్యూస్‌టుడే: భార్య కాపురానికి రాలేదని భర్త ఆత్మహత్యాయత్నానికి పాల్పడి ఆసుపత్రిలో చికిత్స పొందుతూ శనివారం మృతి చెందారు. పోలీసుల కథనం మేరకు.. దగదర్తి మండలం బోడిగుడిపాడుకు చెందిన వెంకటేశ్వర్లు(34), స్వాతి దంపతులు. వెంకటేశ్వర్లు బేల్దారి పనులు చేసుకుంటూ కుటుంబాన్ని పోషించుకుంటున్నారు. ఆయన మద్యానికి బానిస కావడంతో భార్యాభర్తల మధ్య విభేదాలు ప్రారంభమయ్యాయి. మద్యం మానేస్తేనే కాపురానికి వస్తానని చెప్పి ఏడు నెలల క్రితం భార్య పుట్టింటికి వెళ్లిపోయింది. ఆమె కాపురానికి రాలేదన్న మనస్తాపంతో ఈ నెల 2న నగరంలో పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. ప్రభుత్వాస్పత్రికి.. ఆ తరువాత ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ శనివారం మృతి చెందారు. దర్గామిట్ట పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

హోంగార్డుని అన్యాయంగా జైలుకు పంపారు

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట): రాష్ట్రంలో ఎక్కడా లేని విధంగా జిల్లా పోలీసుశాఖలో అవినీతి జరుగుతోందని, కిందిస్థాయి ఉద్యోగులపై అధికారులు తప్పుడు కేసులు బనాయిస్తున్నారని ఎన్‌హెచ్ఆర్, ఎస్‌జేసీ ఏపీ స్టేట్ వైస్ ప్రెసిడెంట్ కె.శ్రీనివాసులు ఆరోపించారు. నగరంలోని ప్రెస్‌క్లబ్‌లో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. 2023లో జిల్లా పోలీసు కార్యాలయంలో స్కాం జరిగితే కార్యాలయంలోని అధికారిపై చర్యలు లేవని, ఓ హోంగార్డుని ఇటీవల అన్యాయంగా జైలుకి పంపి వారి కుటుంబాన్ని రోడ్డున పడేశారన్నారు. ఉన్నతాధికారులు విచారణ చేసి చర్యలు తీసుకోవాలన్నారు.